ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
బుధవారం 29 జనవరి 2025

మా అక్షరం మీ ఆయుధం నినాదంతో దశాబ్దాలుగా బాధితుల పక్షాన నిలుస్తున్న ఆంధ్రజ్యోతి ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు వార్తలుగా మలచి వెలుగులోకి తీసుకువస్తున్న ఆంధ్రజ్యోతి, మరొక అడుగు ముందుకు వేసి ఆచరణాత్మక కార్యక్రమం ప్రారంభించింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పేరుతో మదనపల్లెలోని ప్రశాంత్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి స్థానిక కదిరి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి కమ్యూనిటీ హాలులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన చర్చా వేదికకు అనూహ్య స్పందన లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని తమ కాలనీలోని సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల వెంటనే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

అక్షరమే అండ...

- ఆంధ్రజ్యోతి చర్చావేదిక విజయవంతం
- రూ.1.64 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం
- మున్సిపల్ కమిషనర్ ప్రమీల
- సమస్యలు విన్నవించిన జనం... ఆలకించిన అధికారులు
- ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి అందరి ప్రశంసలు
- ప్రశాంత్‌నగర్ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం


సమావేశానికి హాజరైన ప్రశాంత్‌నగర్ ప్రజలు


మదనపల్లెలో డ్రైనేజీ నిర్మించాల్సిన కదిరి రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చిత్రంలో జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, మహిళా నేత దారం అనిత, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ తదితరులు



మదనపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయుధంగా 22 ఏళ్లగా ప్రజల పక్షాన రాజీ లేని పోరాటం చేస్తున్న ఆంధ్రజ్యోతి సమస్యలను పత్రికలో ప్రస్తావించడమే కాదు, వాటి పరిష్కారానికి తనవంతు పాత్ర పోషించాలని నడుం బిగిస్తూ 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' అనే పేరుతో కార్యక్రమానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక కదిరి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి కమ్యూనిటీ హాలులో ప్రశాంత్‌నగర్ సమస్యలపై నిర్వహించిన చర్చావేదిక విజయవంతమైంది. 30వ వార్డు పరిధిలోని ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడుకాలనీ, సప్తగిరినగర్ ప్రాంతాలకు చెందిన ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోయేషన్‌తో పాటు ప్రముఖులు, స్థానికులు 120 మంది హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, జనసేన నేతలు దారం అనిత, శ్రీరామ రామాంజనేయులు, బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ హాజరయ్యారు. ముఖ్యంగా మదనపల్లెలోని అన్ని కాలనీల అసోసియేషన్స్ (అపెక్స్) అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సభ్యుడు కె.అమర్‌నాథ్‌రెడ్డి, రవీంద్రనాయుడు, మార్పూరి మల్లికార్జున నాయుడు, తదితరులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో ప్రస్తావించిన ప్రశాంత్‌నగర్ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఆ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్‌తో పాటు కొన్ని ప్రాంతాల్లో వర్షం వస్తే నీటి నిల్వ ఉంటోందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎమ్మెల్యేతో కలసి ఆ సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యను గుర్తించారన్నారు. రూ.10 లక్షలతో సప్తగిరినగర్ నుంచి డ్రైనేజీ నిర్మించాలని భావించామని, అయితే నీటిని తరలించేందుకు ప్రైవేటు భూములు ఉన్నందున ఇబ్బందిగా మారిందన్నారు. టిప్పుసుల్తాన్ గ్రౌండ్ నుంచి ప్రశాంత్‌నగర్ మీదుగా మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.1.64 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే ఈ మూడు ఏరియాలలో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు కమిషనర్ వివరించారు. రూ.44 లక్షలతో బీటీ రోడ్డు, రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, ఏవీ నాయుడు కాలనీలో, రూ.32 లక్షలతో జ్ఞానోదయ స్కూల్ వద్ద డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ వేదికలో ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ 22 ఏళ్లగా ఆంధ్రజ్యోతి ప్రజాసమస్యలు, అవినీతి, రాజకీయ నేతల లొసుగులపై పోరాటం చేస్తోందన్నారు. ప్రజలకు-అధికారులకు మధ్య వారధిగా వ్యవహరించేందుకు ముందుకు వచ్చిన ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలుపుతూ ఈ వేదిక ద్వారా ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని రామాంజనేయులు కోరారు. జనసేన మహిళా రాష్ట్ర నేత దారం అనిత మాట్లాడుతూ 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, ఆరు నెలల్లోనే అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. ప్రశాంత్‌నగర్ ప్రజలు ఆంధ్రజ్యోతి చర్చా వేదికలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి ముందుకు రావడాన్ని ఆమె అభినందించారు.

ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి సమస్యలపై పలుమార్లు గ్రామసభలు, స్పందన కార్యక్రమాల్లో అర్జీలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ప్రశాంత్‌నగర్ లోతట్టు ప్రాంతంలో ఉన్నందున నీరుగట్టువారిపల్లె వైపు నుంచి వర్షపునీరు ముంచెత్తుతోందన్నారు. ఆ నీటిని మళ్లించేందుకు పెద్ద డ్రైనేజీ కాలువను నిర్మించి నీటిని కురవంకలోకి కలపాలని కోరారు. వీధి కుక్కలు గుంపులు గుంపులుగా ఉంటూ చిన్నపిల్లలు, వృద్ధులను ఇబ్బంది పెడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని నారాయణరెడ్డి కోరారు. అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురికినీటి కాలువలు విస్తరించాల్సి ఉందన్నారు. కురవంకకు ఇరువైపులా ఆక్రమించడంతో అది డ్రైనేజీగా మారిపోయిందన్నారు. ఆ నీరు కోమటివానిచెరువులో కలవకుండా ప్రత్యామ్నాయ మార్గం చూడాలని తిరుపతిరావు సూచించారు. ఆంధ్రజ్యోతి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి గౌనిపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఒకరోజు పేపర్‌లో రాసేసి మా పని అయిపోయిందని చేతులు దులుపుకోకుండా పట్టణంలో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి కూడా ఆంధ్రజ్యోతి ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే 'అక్షరం అండగా- పరిష్కారం అజెండాగా' కార్యక్రమాన్ని మదనపల్లెలో నిర్వహించినట్లు వివరించారు. చర్చా వేదికకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ధైర్యంగా ప్రస్తావించే ఆంధ్రజ్యోతి మరో అడుగు ముందుకేసి వాటి పరిష్కారానికి నడుం బిగించిందని కొనియాడారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడాన్ని శివప్రసాద్ అభినందించారు.

కురవంకలో ఆక్రమణలు తొలగించాలి

- తిరుపతిరావు, అఫెక్స్ అసోసియేషన్, అధ్యక్షుడు, మదనపల్లె


ప్రశాంత్‌నగర్ గుండా వెళ్తున్న కురవంకలో ఇరువైపులా పిల్లర్లు వేసి ఇళ్లు నిర్మించారు. దీనివల్ల వర్షపు నీరు బయటకు వెళ్లడానికి అవకాశం లేదు. ఈ కాలువ గుండా వెళ్లే మురికినీరు కోమటివానిచెరువులో చేరి దుర్వాసన వస్తోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రశాంత్‌నగర్‌లో సమస్యల తాండవం

- నారాయణరెడ్డి, అధ్యక్షుడు, ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్


ప్రశాంత్‌నగర్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. ముఖ్యంగా రోడ్లు, కాలువల సమస్య అధికంగా ఉంది. ఎన్నోసార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ పరిష్కారం కాలేదు. ప్రధానంగా వర్షం వస్తే ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడుకాలనీ, సప్తగిరినగర్‌లు వర్షపునీటితో నిండిపోతున్నాయి. వీటిని దారి మళ్లించడానికి కమిషనర్ చొరవ చూపాలి.

ఆంధ్రజ్యోతి చొరవ అభినందనీయం

- రవీంద్రనాథ్‌నాయుడు, ప్రశాంత్‌నగర్, మదనపల్లె


ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి ముందుకు రావడం అభినందనీయం. పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. చాలా వరకూ పరిష్కారం కాలేదు. అక్షరం అండతోనైనా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నాం. ప్రజలు కూడా ముందుకొచ్చి తాము స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పత్రిక దృష్టికి తేవాలి.

సమస్యలన్నీ ఎమ్మెల్యే దృష్టికి

- మస్తాన్‌వలి, టీడీపీ నాయకుడు, ప్రశాంత్‌నగర్


చర్చా వేదికలో ప్రస్తావనకు వచ్చిన రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలన్నీ కమిషనర్ ప్రమీల ద్వారా స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్తాం. ఇప్పటికే రూ.1.68 కోట్లతో కదిరి రోడ్డు వెంబడి పెద్ద డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ తెలిపారు.

మీ పిల్లలనైతే....ఇలాగే చూస్తారా!

- కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బాధ్యులపై చర్యలు
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


సిబ్బందిని ప్రశ్నిస్తున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మీ పిల్లలనైతే ఇలాగే చూస్తారా...సొంత బిడ్డల్లా చూసుకోవాల్సింది పోయి చాకిరీ చేయించుకోవడం ఏంటి.. కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి తెలిపారు. ములకలచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జరిపిన సామాజిక తనిఖీలో విస్తుపోయే నిజాలు బయటపడడం, వాటిని తల్లిదండ్రుల సమక్షంలో సామాజిక తనిఖీ బృందం వెల్లడించిన విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి విద్యార్థినులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. పిల్లల చేత కాళ్లు పట్టించుకోవడం, వేడినీళ్లకు డబ్బులు వసూలు చేయడం, అన్నంలో పురుగులు వస్తున్నాయంటే తిట్టడం, వేధించడం వంటివి చేయడం దారుణమన్నారు. ఇక్కడ చదువుతున్నది పిల్లలను మీ బిడ్డలుగా భావించాలన్నారు. విద్యార్థినులను వేధించిన వారిపై చర్యలు తప్పవన్నారు. విద్యాలయంలో తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇక మీదట అధికారులతో కలిసి నెలకు మూడుసార్లు ఖచ్చితంగా విద్యాలయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. పాఠశాలలో ఎవరు వేధించినా, చాకిరీ చేయించుకున్నా, తిట్టినా తనకు ఫోన్ చేసి చెప్పాలని విద్యార్థినులకు ఆయన తన మొబైల్ నెంబర్ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ, ఎంఈవో వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, పారిశ్రామికవేత్త మంత్రి గిరిధర్‌రెడ్డి, నాయకులు భజంత్రి రామాంజులు, నీలకంఠారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- రూ.270 కోట్లతో హంద్రీ-నీవా, శ్రీనివాసపురం రిజర్వాయర్ అభివృద్ధి పనులు
- రూ.300 కోట్లతో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


వెలిగల్లు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తదితరులు

గాలివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాగా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందుకెళుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టులో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రూ.270 కోట్లతో రెండు ప్యాకేజీలతో హంద్రీ-నీవా, శ్రీనివాసపురం రిజర్వాయర్ అభివృద్ధి పనులను చేపట్టి 22 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. రూ.300 కోట్లతో రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 760 గ్రామాలకు వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా చేసి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఈ పనులకు టెండర్లను కూడా పిలుస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, వెలిగల్లు ప్రాజెక్టులో 4.80 లక్షల చేప పిల్లలను వదిలామని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం వారికి సబ్సిడీపై వలలు, బోట్లు, ఐస్ బాక్సులు, మోటారు సైకిల్ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. గాలివీడు మండలంలో దాదాపు 300 కుటుంబాలు చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారందరికీ తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేయించి ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇలాంటి మంచి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ సుస్మిత, వెలిగల్లు ప్రాజెక్టు డీఈ భాస్కర్‌బాబు, ఏఈ సాంబశివ, తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీవో జవహర్ బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకయ్య, ఫిషర్ అసిస్టెంట్ రామాంజనేయులునాయక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాతావరణానికి అనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు

పీలేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాతావరణానికి అనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు మామిడి రైతులకు సూచించారు. పీలేరు మండలం తలపుల గ్రామంలో అన్నమయ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం మంగళవారం మామిడి రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మామిడిలో పూత తక్కువగా ఉందని, పూత రాని తోటల్లో మొగ్గలు పెరగడానికి, ఆడ పూల శాతం పెరగడానికి ఒక లీటరు నీటిలో 10 గ్రాముల పొటాషియం నైట్రేట్(మల్టీ కే), 5 గ్రాముల ఫార్ములా-4 లేదా ఆర్కా మ్యాంగో స్పెషల్ పిచికారీ చేయాలన్నారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న మాట్లాడారు.

సబ్సిడీపై మామిడి కవర్లు : మామిడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ ఏడాది మామిడి పండు (ఫ్రూట్) కవర్లు సబ్సిడీపై అందజేస్తోందని రవిచంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో పీలేరు వ్యవసాయ శాఖ ఏడీ రమణరావు, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, జయబ్బ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జంబోరి వేడుకలకు జిల్లా విద్యార్థులు

రాయచోటిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరుచిరాపల్లిలో నిర్వహించనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకలకు జిల్లా స్కౌట్స్ విద్యార్థులు తరలివెళ్లారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరయ్యే ఈ వేడుకలను ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతీయ జంబోరి అనేది విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. ఇందులో ఇతర దేశాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఫుడ్ ఎగ్జిబిషన్, మార్చ్ ఫాస్ట్, యోగ, క్యాంప్ ఫైర్ తదితర విభాగాల్లో విద్యార్థుల మధ్య పోటీ ఉంటుందన్నారు. ఈ జంబోరి వేడుకలకు జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి పంపుతున్నట్లు తెలిపారు.


జాతీయ జంబోరి వేడుకలకు వెళుతున్న జిల్లా స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు

నేడు పీలేరుకు నారా భువనేశ్వరి రాక

- పాడి రైతుల మహా సదస్సు, భారీ పశువైద్య శిబిరం
- హెరిటేజ్ సంస్థ పాల సేకరణ విభాగం అధిపతి రామ్మోహన్‌రావు


విలేఖరులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

పీలేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం పీలేరుకు రానున్నారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఆమె పీలేరులోని హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలించనున్నారు. ఆమె పర్యటన వివరాలను మంగళవారం ఆ సంస్థ పాలసేకరణ విభాగం అధిపతి రామ్మోహన్‌రావు వెల్లడించారు. పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ నారా భువనేశ్వరి పర్యటన సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పాడి రైతుల మహా సదస్సు, భారీ పశువైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పీలేరు డెయిరీ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న 15 మంది రైతులకు ఆమె బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పీలేరు చిల్లింగ్ సెంటర్ ద్వారా 250 గ్రామాల నుంచి 3 వేల మంది రైతుల దగ్గర నుంచి రోజుకు 35 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పీలేరు సెంటర్ ద్వారా రోజుకు 50 వేల లీటర్ల పాలు సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులకు బీమా సదుపాయంతో పాటు వారి ఆర్థిక అవసరాలు తీర్చేందుకు తమ సంస్థ రుణాలు అందిస్తుందని, తమ సంస్థలో తీసుకోవడం ఇష్టం లేని రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సహాయకారిగా నిలుస్తోందన్నారు. అమెరికాకు చెందిన 'టెక్నో సెర్వ్' సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నామని, ఆ సంస్థ భాగస్వామ్యంతో పశు, రైతుల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. నారా భువనేశ్వరి బుధవారం ఉదయం 11 గంటలకు పీలేరుకు చేరుకుంటారని ఆయన వెల్లడించారు. పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ సంస్థ అధికారులు గోపాలకృష్ణ, సర్వోత్తమ రెడ్డి, దామోదర్ నాయుడు, డాక్టర్ శ్రీను, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి..కర్బూజ..!

- పంటను దెబ్బతీసిన వైరస్...ప్రతికూల వాతావరణం
- భారీగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడులు కూడా రాక రైతులకు తీవ్ర నష్టం

4

రారండోయ్.. వేడుక చూద్దాం..

4

- నేటి నుంచి ఫిబ్రవరి 3 వరకు

కోసువారిపల్లె వెంకన్న ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం

కన్నీటి..కర్బూజ..!

- పంటను దెబ్బతీసిన వైరస్...ప్రతికూల వాతావరణం
- లోపల తెల్లగా గూడు కట్టడంతో తినేందుకు పనికిరాని కాయలు
- కోయకుండా పొలాల్లో వదిలేస్తున్న వైనం
- భారీగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడులు కూడా రాక రైతులకు తీవ్ర నష్టం



కాయ లోపల తెల్లగా గూడుకట్టి తొర్రగా ఉన్న దృశ్యం



వేపూరికోట సమీపంలో వైరస్ సోకడంతో పొలంలో వదిలేసిన కర్బూజ కాయలు

ములకలచెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్బూజ పంట రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను వైరస్...ప్రతికూల వాతావరణం కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పంట సాగు చేసిన ప్రారంభంలో వరుసగా వచ్చిన తుఫాన్లతో వర్షాలు కురవడం...విపరీతమైన మంచు..ఎండ లేకపోవడంతో వైరస్‌లు చుట్టుముట్టాయి. నివారణకు ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా కాయ లోపల తెల్లగా గూడు కట్టి గట్టిగా తొర్ర ఏర్పడడంతో తినడానికి పనికిరాకుండా పోయాయి. దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. దీంతో అంతంతమాత్రంగా దిగుబడి రావడంతో చేసేది లేక కాయలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు.

తంబళ్లపల్లె నియోజవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చు చేశారు. గత ఏడాది అక్టోబరు, నవంబరు మొదటి వారంలో పంట సాగు చేశారు. డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్ కారణంగా ఎండకాయకపోవడంతో వైరస్‌లు విపరీతంగా సోకాయి. దీంతో రైతులు పలు రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. కాయలు సైజు రాకపోగా వైరస్ కారణంగా లోపల తెల్లగా గూడు కట్టి గట్టిగా ఉంది. 80 శాతం కాయలు వైరస్ బారిన పడి తినడానికి వీలు లేకుండాపోయింది. దీంతో వ్యాపారులు పొలాల వద్దకు వచ్చి మంచి కాయలు మాత్రమే కోసుకెళ్లి వైరస్ సోకిన కాయలు వదిలేస్తున్నారు. వైరస్ సోకిన కాయలు పనికి రాకుండా పోవడంతో రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.

ఎకరాకు మూడు టన్నులకులోపే...

వైరస్, ప్రతికూల వాతావరణంలో కర్బూజ దిగుబడి కూడా భారీగా తగ్గింది. గత ఏడాది ఎకరాకు రూ.10 నుంచి 15 టన్నుల కాయల దిగుబడి వచ్చింది. ఇప్పుడు మాత్రం ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల లోపు మాత్రమే దిగుబడి వస్తోంది. అలాగే గత ఏడాది కాయ సైజు ఎనిమిది నుంచి 12 కేజీల వరకు ఉండేది. ప్రస్తుతం కాయ సైజు ఏడు కేజీల లోపే ఉంది. దీనిని బట్టి చూస్తే దిగుబడి ఎంతమాత్రం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే ధర కూడా తగ్గుముఖం పట్టింది. వారం రోజుల క్రితం వరకు కేజీ రూ.17 పలికిన ధర ప్రస్తుతం రూ.10 నుంచి రూ.12 మాత్రమే ఉంది.

రూ.5 లక్షలు ఖర్చు చేస్తే...రూ.4లక్షలు నష్టం..



ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ గురికివారిపల్లెకు చెందిన రైతు బాలాజీ నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడు. సాగు ఖర్చు రూ.5 లక్షలు పెట్టుబడి ఖర్చు వచ్చింది. వాతావరణం అనుకూలించక వైరస్ సోకి, అధిక మంచు కారణంగా దిగుబడి భారీగా తగ్గిపోయింది. నాలుగు ఎకరాలకు రూ.లక్ష మాత్రమే వచ్చింది. రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే రూ.4 లక్షలు నష్టం వచ్చింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిక పంట రైతును కష్టాల్లో ముంచింది. ప్రభుత్వం ఆదుకోవాలని కర్బూజ రైతులు వేడుకుంటున్నారు.

మూడు ఎకరాలకు.. ఐదు టన్నుల దిగుబడి వచ్చింది



ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన రైతు మూగి రవిచంద్ర మూడు ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశాడు. దీనికి రూ.3.50 లక్షలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. 30 టన్నులకుపైగా రావాల్సి దిగుబడి కేవలం ఐదు టన్నులు మాత్రమే వచ్చింది. ఉన్న కాయల్లో 90 శాతం కాయలు వైరస్ బారిన పడ్డాయి. కాయ కోసి చూస్తే లోపల తెల్లగా గూడుకట్టి గట్టిగా ఉంది. ఐదు టన్నులకు ప్రస్తుతం ఉన్న ధరను బట్టి రూ.60 వేలు వచ్చింది. ఈ రైతుకు రూ.2.90 లక్షలు నష్టం వచ్చింది. వరుసగా ఏడేళ్లుగా పంట సాగు చేస్తున్న ఈ రైతుకు ప్రస్తుతం వచ్చిన నష్టం ఎప్పుడూ రాలేదు.

అధికారులు బోర్డు నాటారు.. కబ్జాదారులు తీసేశారు

- ప్రభుత్వ స్థలం అని నాటిన బోర్డును మాయం చేసిన వైనం
- సోమవారం రాత్రి గుట్ట చదును





ప్రభుత్వ స్థలం అని పది రోజుల క్రితం తహసీల్దార్ ఏర్పాటు చేసిన బోర్డు - బోర్డు తీసేసి సోమవారం రాత్రి గుట్ట చదును చేసిన దృశ్యం

సుండుపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటివాండ్లపల్లె జగనన్న కాలనీ సమీపంలో పది రోజుల క్రితం కొందరు కబ్జా చేసేందుకు గుట్టను చదును చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దైవాదీనం ఇది ప్రభుత్వ స్థలమని, ఇతరులకు ఈ స్థలంలోకి అనుమతి లేదని బోర్డు నాటించారు. అయితే సోమవారం రాత్రి కొందరు ఆ బోర్డును తొలగించి యంత్రాలతో గుట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లతో తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలం అని అధికారులు బోర్డు నాటినా ఆక్రమణదారులు లెక్కచేయకుండా ఆ బోర్డును తొలగించి గుట్టను చదును చేస్తుండటం గమనార్హం. బోర్డు తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, చెరువులు, కుంటలు ఆక్రమణలు జరగడం వెనుక సరైన చర్యలు లేకపోవడమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఆ స్థలం చదును చేసింది ఎవరో కూడా రెవెన్యూ అధికారులకు తెలుసని అయినా వారిపైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

వెంటనే బోర్డు నాటిస్తాము

గుట్టను ఆక్రమించినట్లు సమాచారం రావడంతో గతంలో బోర్డు ఏర్పాటు చేయించాము. ఆ బోర్డును ఎవరు తొలగించారో తెలియదు. వెంటనే ఆ స్థలంలో బోర్డు తిరిగి ఏర్పాటు చేస్తాము.

- దైవాదీనం, తహసీల్దార్

కార్పెంటర్ ఆత్మహత్య



కార్పెంటర్ రవి మృతదేహం

కురబలకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన రవి (25) కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇంటి స్థలం విషయమై తన సమీప బంధువులతో వివాదం నెలకొంది. దీంతో మనస్థాపానికి గురైన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రి వేడుకలకు కలెక్టరుకు ఆహ్వానం

బి.కొత్తకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ ఆశ్రమంలో నిర్వహించే శివరాత్రి వేడుకలకు విచ్చేయాలని బి.కొత్తకోట మండలం బీరంగి వద్ద వెలసిన బండెన్నస్వామి ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి కలెక్టరు శ్రీధర్‌ను ఆహ్వానించారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టరేట్‌కు వెళ్లి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా బండెన్న స్వామి ఆలయం గురించి కలెక్టరుకు పీఠాధిపతి వివరించారు. ఆయన వెంట పలువురు అధికారులు, అనుచరులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

సిద్దవటం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం పోలీసుస్టేషన్ పరిధిలోని మంగళవాండ్లపల్లెలో 2013లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారు. అంత్యం సుబ్బయ్య, అంత్యం సురేష్ అనే నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెక్షన్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

భార్యాభర్తలపై దాడి





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రమణారెడ్డి, లక్ష్మీదేవమ్మ

పెద్దతిప్పసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తి ఇంట్లోకి జొరబడి భార్యాభర్తలను తీవ్రంగా గాయపరిచిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాపూరివాండ్లపల్లె పంచాయతీ డి.నారాయణపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు జల్లు వెంకట్రమణారెడ్డి, ఆయన భార్య లక్ష్మీదేవమ్మ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రతాప్‌రెడ్డి ఆ దంపతులపై దాడి చేశాడు. గురువారం పట్టపగలు వెంకట్రమణారెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు ఇంటిలో ఉండగా అదే గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే యువకుడు ఇంట్లోకి జొరబడి ఆ ఇరువురిపైన విక్షణారహితంగా దాడి చేశాడు ఇంటిలోనుంచి వారిని బయటకు లాగి కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దుతూ బీభత్సం సృష్టించాడు స్థానికులు మందలిస్తున్నా వినకుండా ఆ దంపతులపై దాడి చేసి కొట్టి గాయపరిచాడు ఆ దంపతుల అరుపులు విని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంకట్రమణారెడ్డి కుమారుడు నాగిరెడ్డి బెంగళూరు నుంచి తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి జరిగిన సంఘటనను తెలుసుకుని పోలీసులకు ప్రతాప్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు దంపతులపై దాడి చేసిన ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం పీటీఎం ఎస్ఐ రవికుమార్ తెలిపారు. తన గురించి మాట్లాడుతున్నారని వేరే వ్యక్తులు అతనికి చెప్పడంతో వారిపై విచక్షణారహితంగా దాడి చేశాడన్నారు. గతంలో ప్రతాప్‌రెడ్డిపై మర్డర్ కేసు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. గత నెల క్రితం రంగసముద్రం పంచాయతీ కొత్తసుబ్బరాయుని గ్రామానికి చెందిన ఓ మైనార్టీ కుటుంబంపైన దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మదనపల్లె సమస్యలు పరిష్కరించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి టీడీపీ, జనసేన నాయకుల విన్నపం



మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి మదనపల్లె టీడీపీ, జనసేన నాయకులు విన్నవించారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలసిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన రాయలసీమ కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సురేంద్రయాదవ్ సమస్యల గురించి వివరించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సమస్యలు, పార్టీ నాయకుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై త్వరలోనే సమీక్షించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మేకల రెడ్డిశేఖర్, నిమ్మనపల్లె రమణ పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు ప్రయోజనం

- డీహెచ్‌వో రవిచంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

కలకడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తిదారుల సంఘాలతో మామిడి, టమోటా రైతులకు ప్రయోజనం కలుగుతుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. కలకడలో మంగళవారం ఆయన రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మండల రైతులకు సౌకర్యంగా ఉద్యానవనశాఖ, బీఆర్ఈడీఎస్ ఎన్‌జీవో (ఐపీసీ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో రైతు సంఘాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో మొదట పది మందితో బోర్డు ఆఫ్ డైరెక్టర్లను ఎన్నుకోవడం తరువాత సంఘాన్ని కంపెనీ యాక్ట్ కింద రిజిష్టర్ అవుతుందన్నారు. ఇందులో సభ్యత్వం పొందేందుకు టమోటా, మామిడి రైతులు అర్హులన్నారు. పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేలా ఐపీసీ మార్కెట్ లింకేజీ కొనుగోలుకు తోడ్పడుతుందన్నారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో కుమార్‌రెడ్డి, ఐసీపీ ప్రతినిధి భోజరాజు, రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి



వేరుశనగను పరిశీలిస్తున్న డీఏవో చంద్రానాయక్

కలకడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్‌లో నమోదైన ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కలకడ మండల కేదొడ్డిపల్లె రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లు ఉన్న రైతులు ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు పొందాలన్నారు. అనంతరం దేవళపల్లె, ఎనుగొండపాలెం, ముడియంవారిపల్లె గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంట విస్తీర్ణాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అలాగే రైతులకు పంట సాగుపై తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామయ్యచౌదరి, ఏవోలు లావణ్య, వెంకటమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..

- నేటి నుంచి ఫిబ్రవరి 3 వరకు కోసువారిపల్లె వెంకన్న ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం
- ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు
- ముస్తాబవుతున్న వెంకన్న ఆలయం



ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి

తంబళ్లపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలకు సుందరంగా ముస్తాబవుతోంది. రెండు ఉత్సవాలు ఒక దాని తర్వాత ఒకటి ఉండటంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, వార్షిక బ్రహోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ఉత్సవాల ఆహ్వాన పత్రికలను తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని జేఈవో కార్యాలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ ఆవిష్కరించారు. ఈనెల 29 తేదీ సాయంత్రం టీటీడీ వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయ నూతన రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవానికి అంకురార్పణ చేపట్టనుండగా, ఫిబ్రవరి 2 వరకు ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు, 3వ తేదీ ఉదయం చతుష్టానార్చన, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, ఉదయం 9:30 నుంచి 10.15 వరకు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, కుంభప్రోక్షణ, శాత్తుమొర, నివేదన, మంగళహారతి, ఆచార్య బహుమానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం కానుండగా..12 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవంతో పాటు, శ్రీవారి వాహన సేవల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఆలయం లోపల, వెలుపల టీటీడీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో పాటు స్వామి వారి విద్యుత్‌దీప కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి కళాకారులు రంగురంగుల ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళవారం నాటికి ఏర్పాట్లు పూర్తవుతాయని ఆలయ అధికారి దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్ తెలిపారు.



తీర్చిదిద్దుతున్న రంగవల్లులు కళాకారుడు

ఆలయ స్థల పురాణం..

క్రీస్తు పూర్వం 14వ శతాబ్దంలో వేంగి చోళ మహారాజు కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామిని ప్రతిష్ఠించినట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. విజయనగర సామ్రాజ్యానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు కుటుంబీకులైన అచ్యుతదేవరాయలు, కంభం తిమ్మరాజు స్వామి వారికి అనేక సువర్ణాభరములు చేసి అనేక మాన్యములు దానమిచ్చినట్లుగా శాసనంలో ఉంది. చోళ మహారాజు ఒకరోజు రాత్రి ఈ ప్రదేశం (ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశం)లో బస చేయగా స్వామి వారు కలలోకి వచ్చి ఈ ప్రదేశంలో ఆలయం నిర్మించమని కోరగా వెంటనే చోళ మహారాజు ఆలయం నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. తాళ్లపాక అన్నమాచార్యులు కూడా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని అనేక సంకీర్తనలు రచించినట్లు పురాణాలు చెపుతున్నాయి.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ఇలా..

ఫిబ్రవరి 3వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అంకురార్పణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 4న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఉత్సవం, 5న ఉదయం శేష వాహనము, రాత్రికి హంస వాహనం, 6న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనం ఉంటాయి. 7వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, 8న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 9న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, అనంతరం 10:30 గంటలకు గరుడ వాహన సేవ, 10న ఉదయం రథోత్సవం, రాత్రి గజవాహనం, 11న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి అశ్వవాహనంపై స్వామి వారు విహరించనున్నారు. 12న ఉదయం 7 నుంచి 9 గంటల నడుమ వసంతోత్సవం, 11:30 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం, 13న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 8 గంటల మధ్య పుష్పయాగంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారికి వాహన సేవలు ఉదయం 8 గంటల రాత్రి 8 గంటలకు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకూ స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ రాజగోపురం

ఇసుక రీచ్‌ను తలపిస్తున్న దేవగుడి పెన్నానది

● అడ్డూ అదుపు లేకుండా ఇసుక రవాణా
● నిద్రావస్థలో అధికారులు



దేవగుడి పెన్నానదిలో ఇసుక నింపుతున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో అధికారులు నిద్రావస్థ వీడాలని పలుప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రొద్దుటూరు రోడ్డులో పెన్నానది పరిసర ప్రాంతాలన్నీ ఇసుక రీచ్‌లు తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.సుగుమంచిపల్లె గ్రామం పెన్నానది నుంచి దేవగుడి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూలు వెనుకభాగాన రాత్రి, పగలు ఇసుక తరలిపోతోంది. ఇసుక అక్రమ రవాణా గురించి స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు ఫొటోలు తీసి సమాచారం ఇచ్చినా ఏ ఒక్క అధికారీ భయంతో రావడం లేదని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు రోడ్డులో రాత్రి టిప్పర్ల ద్వారా ఇసుక తరలిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దానవులపాడు పెన్నానదిలో దేవగుడి, పి.సుగుమంచిపల్లె తదితర గ్రామాల్లో భారీగా ఇసుక తరలిపోతోందని ఆ ప్రాంతీయులు వాపోతున్నారు. ముద్దనూరు రోడ్డులో పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, గూడుమస్తాన్‌వలి దర్గా వెనుక భాగాన మున్సిపాలిటీకి సంబంధించిన కంపోస్టు యార్డు సమీపంలో, మోరగుడి గ్రామం టీచర్స్ కాలనీ, రచ్చబండ వద్ద మైలవరం మండలం దొమ్మరనంద్యాల, వేపరాల గ్రామాల్లో జోరుగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అవసరం లేకున్నా పొలాల్లో, ఖాళీ స్థలాల్లో ఇసుక ట్రాక్టర్ల యజమానులు డంప్ చేసి అక్కడి నుంచి లారీల్లో, టిప్పర్లలో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో చుట్టుపక్కల గ్రామాలకు పెన్నానదిలో ఉండే బోర్లకు నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, అధికారులు నిద్రావస్థను వీడి కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థి చెయ్యి విరగడంపై విచారణ



విద్యార్థిని విచారిస్తున్న ఎంఈఓ శోభారాణి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వసంతపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి శివరాంను ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చెయ్యి విరిగిన సంఘటనపై ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి విచారణ జరిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి 23వ తేదీ పాఠశాలకు పుస్తకాలు తీసుకురాలేదని ఆగ్రహించిన సైన్స్ ఉపాధ్యాయుడు మురళి ఆ విద్యార్థిని కొట్టాడు. దీంతో ఆ విద్యార్థి చెయ్యి విరిగింది. ఈ సంఘటనపై విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ షంషుద్దీన్ విచారణకు ఆదేశించారు. డీఈఓ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో ఎంఈఓలు విద్యార్థి శివరాం, తండ్రి మహేష్‌ను విచారించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ డీఈఓ ఆదేశాల మేరకు బుధవారం మరోసారి పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులుతో విచారించి డీఈఓకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుజాత, ప్రజా సంఘాల నేతలు ఓబులేసు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గోపవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బద్వేలు శరత్‌కుమార్ (22) మృతి చెందాడు. శరత్‌కుమార్ జీవనోపాధి కోసం శ్రీనివాసపురం వద్ద పెట్రోలు బంకులో పనిచేస్తుండేవాడు. డ్యూటీ ముగించుకుని ఇంటికి బైక్‌లో వస్తుండగా నెల్లూరు రోడ్డులో ఆర్టీసీ బాడుగ బస్సు ఢీకొంది. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన యువకుడికి చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని బస్సు యాజమాన్యంతో సంప్రదించినా ఫలితంలేదు.

లారీ... చోరీ...

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కుక్కలదొడ్డి ప్రధాన రహదారిపై నిలుచున్న 12 చక్రాల లారీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని లారీ డ్రైవర్ బాల వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి ఐరన్‌లోడుతో వెళ్తూ కుక్కలదొడ్డి వద్ద భోజనం చేసి రాగా లారీ దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

అతివేగం - ప్రమాద సంకేతం

నైపుణ్యం చూపే తాపత్రయం ● బైక్‌ను అదుపు చేయలేని వయస్సు ● ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేని వైనం
నెత్తురోడుతున్న రోడ్లు ● ప్రాణాలు కోల్పోతున్న యువత ● కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు



వయసుకు మించిన బరువైన వాహనం (బుల్లెట్)లో యువకుడు

బద్వేలుటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రకరకాల మోడళ్లలో ద్విచక్ర వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. వాటి రంగులు, వేగం యువతను ఆకట్టుకుంటుండడంతో ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేమితో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. అతి వేగం ప్రమాద సంకేతం అంటూ పెద్దలు అరుస్తున్నా తను నడుపుతున్న వాహనంపై నైపుణ్యాన్ని ప్రదర్శించాలనే తాపత్రయంలో అతి బరువైన బైక్‌ను అదుపు చేసే వయస్సు చాలక ప్రమాదాల భారిన పడుతున్నారు. నెత్తురోడుతున్న రోడ్లను చూసి కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. నిత్యం రోడ్ల ప్రమాదాలు జరుగుతున్న విధానాలు చూస్తున్నా యువత అతివేగంగా బైక్‌ను నడుపుతుండడంతో వారికి ఎదురొచ్చిన వాహనాలు సైతం ప్రదాలకు గురవుతున్నాయి. అతివేగం, ఆవేశం ఏది ఎక్కువైనా మూల్యం చెల్లించుకోక తప్పదని కాలం చెబుతూనే ఉంది. ద్విచక్రవాహనాలు నడిపేందుకు నేటి కుర్రకారు ఆసక్తి కనబరుస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వాహనాన్ని వేగంగా నడుపుతూ అడ్డూ అదుపులేకుండా దూసుకెళుతున్నారు. సరదా షికారు మోజులో ప్రాణాలమీదకు తెచ్చుకుంటూ తల్లిదండ్రులకు గర్భశోకం మిగుల్చుతున్నారు.

అతివేగంతో పోతున్న ప్రాణాలు

చేతిలో వాహనం ఉంటే హద్దులు మరచిపోతున్నారు. ఇంట్లోవారికి తెలియకుండా బయటకు తీసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ రయ్...రయ్ మంటూ యువత రోడ్లపైకి వస్తున్నారు. ఈ క్రమంలో వేగాన్ని అదుపుచేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నారు. సినిమా హీరోల్లా చేతులువదిలి డ్రైవింగ్‌చేస్తూ పట్టుతప్పి ప్రమాదాల భారిన పడుతున్నారు. ఒక్కవాహనం మీద ముగ్గురూ లేదా నలుగురు కూర్చుని గాల్లో తేలిపోతున్నట్లు అతివేగంగా, అడ్డదిడ్డంగా నడుపుతూ పాదచారులు, వాహనదారులు, ఎదురుగా వస్తున్నవారిని గాయపరుస్తూ వీరూ ప్రమాదాల భారినపడి కాళ్లు చేతులు విరిగిపోవడంతో వికలాంగులుగా మంచానికి పరిమితమవుతున్నారు.

చెడు అలవాట్లకు బానిసలవుతూ

దేశానికి, కుటుంబానికి వెన్నుదన్నులా ఉండాల్సిన నేటి యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ఎంజాయ్‌పేర్లతో పార్టీలు చేసుకుంటూ చెడుమార్గంలో పయనిస్తున్నారు. ద్విచక్ర వాహన దారులతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎటునుంచి ఏ వాహనం వస్తుందో.. ఎక్కడ తగిలి ప్రమాదాల భారినపడతామోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



సంక్రాంతి రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసుమంత్ (ఫైల్‌ఫొటో)

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

18 ఏళ్లలోపు పిల్లలు ద్విచక్రవాహనాలను నియంత్రించే సామర్థ్యాలు వారికి ఉండవు. మోటారు వెహికల్ చట్టాలు నిబంధనలపై అవగాహన ఉండదు. ద్విచక్రవాహనాల అనుమతులు పొందేందుకు అర్హులుకారు. విషయాలన్నీ తెలియజేసేందుకు రోడ్డు భద్రతా వారోత్సవాలు, సాధారణ రోజుల్లోనూ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో యువతకు అవగాహన లేకపోవడంతో, నిబంధనలు పాటించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు భారినపడడమే గాకుండా మృత్యువాతపడుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే ఎవరికీ వాహనాలు ఇవ్వరాదు. ముఖ్యంగా ద్విచక్రవాహనాలను పిల్లలకు ఇవ్వకూడదు. వారు ఓవర్‌స్పీడు వెళ్లడం, రైజింగ్‌చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. రహదారులపై రాంగ్ డ్రైవింగ్, హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడపడం, త్రిపుల్‌రైడింగ్ వంటివి చట్టరీత్యానేరం. తల్లిదండ్రులు జీవనోపాధికి గల్ఫ్‌దేశాలకు వెళ్లి, ఇంటి వద్ద పిల్లల బాధ్యతను అవ్వాతాతలకు అప్పగిస్తుండడంతో పిల్లలు ఎవరికీ తెలియకుండా వాహనాలను ఎలాపడితే అలా నడుపుతూ ప్రమాదాల భారినపడుతూ వందేళ్ల జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. రోడ్డుభద్రతలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా, నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడుపుతున్నారు. అట్టివారిపై కేసులు నమోదు చేస్తున్నాం. తల్లిదండ్రులు, పిల్లలపట్ల జాగ్రత్తలు వహిస్తూ, విలువలు నేర్పిస్తూ మంచినడవడికతో పిల్లలను పెంచాలని.

రాజగోపాల్, బద్వేలు అర్బన్ సీఐ

'వైఎస్'కు వెన్నుదన్ను 'దేవగుడి'

ఆది చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక విమర్శలు ● జీవితమంతా డమ్మీగా మారొద్దు
విలేకరులతో కూటమి నేత గోనా పురుషోత్తం రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నేతలు గోనా పురుషోత్తంరెడ్డి, నాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతిసారీ వైఎస్ కుటుంబానికి అత్యధిక ఓట్లు తెప్పించి వారిని గెలిపించిన ఘనత దేవగుడి కుటుంబానిదేనని కూటమి నేత గోనా పురుషోత్తంరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ కార్యాలయంలో విలేకరులతో కూటమి నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఉన్నంతకాలం జమ్మలమడుగు అభివృద్ధి జరిగిందని, ఎమ్మెల్సీ రామసుబ్బారెడి మంత్రిగా ఉన్నా అభివృద్ధి చేశారా అంటూ సూటిగా ప్రశ్నించారు. దేవగుడి కుటుంబం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేస్తున్న, చేసిన అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి వ్యవసాయం చేస్తానని చెప్పి రాజీనామా చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ చేసిన తప్పుడు అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాలుగు వేల మెజార్టీతో ఎంపీగా గెలిచినప్పుడు జమ్మలమడుగులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైఎస్ కుటుంబానికి అత్యధికంగా ఓట్లు వేయించి గెలిపించిన ఘనత ఆదిదేనన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి నిద్రావస్థలో లేకుండా హుషారుగా బయటకు రావాలని అప్పుడే చేసిన అభివృద్ధి తెలుస్తుందన్నారు. వైసీపీ హయాంలో జమ్మలమడుగులో అభివృద్ధి ఏమేరకు చేశారో ప్రకటించాలని ఆయన సవాల్ విసిరారు. టీడీపీ కూటమి నేతలు దేవగుడి యూత్ సింగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లో టిప్పర్లతో ఇసుకను బయటి ప్రాంతాలకు అమ్ముకుని వ్యాపారం చేశారన్నారు. గతంలో చంద్రబాబు ఆదేశాల మేరకు భూపేశ్‌రెడ్డి తామంతా కలిసి అంబవరం పెన్నానదిలో ఇసుక రీచ్ వద్దకు వెళ్లినప్పుడు నిరసన చేసి బయటకు వస్తే వైసీపీ వారు దారిలో అడ్డుకుని డ్రైవర్‌ను తామే కొట్టామని ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసు తమపై పెట్టారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రభుత్వ వసతి గృహాలు, రోడ్లు, కాల్వలు అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకున్నారన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చౌడం జొల్లు కొండయ్య, నవాబు పేట మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఖాకీ క్రౌర్యానికి వ్యక్తి బలి

స్టేషన్ ఆవరణలోనే విషద్రావణం తాగిన గంగాధర్ ● ఎస్ఐ వేధింపులతోనే ఆత్మహత్య
శోకసంద్రంలో కుటుంబ సభ్యులు ● పోలీసుస్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా





ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్ - పోలీసుస్టేషనుఎదుట ధర్నా చేస్తున్న కుటుంబీకులు

పులివెందుల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాకీల క్రౌర్యానికి సామాన్యుడు బలి అయిన సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేధింపుల తాళలేక మోటున్నూతల పల్లె వాసి రెడ్డిబోయిన గంగాధర్ (30) పోలీసుస్టేషన్ ఆవరణలోనే విషద్రావణం తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే..

రెడ్డిబోయిన గంగాధర్ అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణ. ఈ విషయమై పెద్దమనుషుల వద్ద పంచాయతీ కూడా జరిగింది. అయితే గడ్డం గంగాధర్ భార్యను ఇటీవల రెడ్డిబోయిన గంగాధర్ వేధింపులకు గురిచేసేవాడని ఇదే క్రమంలో 23న బైకుపై వస్తున్న గడ్డం గంగాధర్ తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో గాయాల పాలైన గడ్డం గంగాధర్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు వెదుకుతుండగా రెడ్డిబోయిన గంగాధర్ తప్పించుకుని తిరుగుతున్నాడు. కాగా హఠాత్తుగా మంగళవారం మధ్యాహ్నం రెడ్డిబోయిన గంగాధర్ పోలీసుస్టేషన్ ఆవరణలో ప్రత్యక్షమయ్యాడు. అప్పటికే ఎస్ఐ వేధింపులతో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెబుతూ విషద్రావణం తాగాడు. గమనించిన సిబ్బంది అతన్ని ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించిందని మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించాలని వైద్యులు తెలిపారు. అతన్ని కడపకు తరలిస్తుండగా మృతి చెందాడని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

రెడ్డిబోయిన గంగాధర్ మృతి చెందడంతో గంగాధర్ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇతడికి భార్య సౌజన్య, ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మా కుటుంబానికి దిక్కు ఎవరని రోదనలు పలువురిని కలచివేసింది.

స్టేషన్ ముందు ధర్నా



పోలీసుస్టేషన్ ఎదుట విషద్రావణం తాగుతున్న గంగాధర్

రెడ్డిబోయిన గంగాధర్ మృతి చెందడంతో తండ్రి క్రిష్టయ్య, తల్లి నరసమ్మ, భార్య సౌజన్య, ముగ్గురు కుమార్తెలు కుమారుడుతో కలిసి పోలీసుస్టేషను ఎదుట న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. దీంతో కుటుంబ సభ్యులను సీఐ పోలీసుస్టేషన్‌కు పిలిపించుకుని వాస్తవాలపై మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తానని చెప్పారు. మరి ఏ మేరకు ఆ కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

మనో వికాసానికి మార్గం ధ్యానం : వీసీ



మాట్లాడుతున్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష

కడప ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మనోవికాసానికి ధ్యానం టానిక్‌లా పనిచేస్తుందని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వర్సిటీ సైన్స్ బ్లాక్ సెమినార్ హాల్‌లో విశాఖపట్నంలోని దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొంది ప్రశాంతత ఇవ్వడంలో ధ్యానం సహకరిస్తుందన్నారు. దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష మాట్లాడుతూ ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. సుషుమ్న క్రియ అనేది నాలుగు రకాల ధ్యానాల కలయిక అని వివరించి అవగాహన కల్పించారు. కళ్లు కాకుండా కనుబొమ్మల మధ్య దృష్టి కేంద్రీకరించాలని, శ్వాసపై దృష్టి నిలపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో విషజ్వరాలు

వీరపునాయునిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీ వాసులకు వారం రోజులుగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వైద్య సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో 36 కుటుంబాలు ఉండగా ప్రతి కుటుంబంలో ఒకరిద్దరు చొప్పున దాదాపు 50 నుంచి 60మందికి జ్వరాలు వచ్చాయి. అయితే అక్కడ పనిచేస్తున్న ఏఎన్ఎం కనీసం ఒక కుటుంబానికి మాత్రలు ఇచ్చిన పాపాన పోలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి వైద్యాధికారులు పర్యటించి జ్వర పరీడితులకు వైద్యం అందించాలని అన్నారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

రాయచోటిటౌన్,జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య అన్నమయ్య జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా వీ. జయన్న, కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా ఎం. మహేశ్వరయ్య, జాయింట్ సెక్రటరీగా ఎం. రమణయ్య, జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి ఉపాధ్యక్షులను, జాయింట్ సెక్రటరీలను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భిక్షాలు మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు పొట్టి నరేంద్రబాబు, కడప జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు పిచ్చికే బాబు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మహేశ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టిబాబు తదితరులు హాజరయ్యారు. ఫిబ్రవరి నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే వేల గొంతుకలు, లక్షల డప్పులు కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని తీర్మానించారు.

బోధనేతర సిబ్బంది తొలగింపు అన్యాయం

ఓబులవారిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ నాన్ టీచింగ్ స్టాఫ్ తొలగింపు అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రెండు రోజులుగా ఆయా సిబ్బంది చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం జిల్లా సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, డీఆర్‌యూసీ సభ్యుడు తల్లం భరత్‌కుమార్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఏపీఎండీసీ సంస్థకు ఇళ్లు, భూములు ఇచ్చి నిర్వాసిత మహిళలతో మూడు నెలలు పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. టెండరు లేకుండా కాంట్రాక్టు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఏఎస్పీకి సన్మానం

రాజంపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గంగికోట గుల్జార్ బాషా ఆధ్వర్యంలో సమితి సభ్యులు మంగళవారం ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఏఎస్పీ చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చాంద్‌బాషా, టంగుటూరు బాషా, అన్వర్‌బాషా, నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏపీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. విద్య మేధస్సును పెంపొందిస్తే క్రీడలు శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ఎఫ్ నాయకుడు కిరణ్, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, భద్రప్పనాయుడు, లక్ష్మయ్య, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, వీరరాఘవులు, ఆంజనేయులు, ధర్మారెడ్డి, రాంమోహన్ నాయుడు, శివప్పనాయుడు, డాక్టర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలో షేక్ ఆరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో క్రీడామైదానాలు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గాల్లో క్రికెట్ హబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. తన స్థలాన్ని ఆక్రమించారని జాండ్రపల్లెకు చెందిన మహిళ ఫిర్యాదు చేసిందని వెంటనే ఆమెకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లె ఓబులేసు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో రెడ్డెయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ హరిప్రసాదు, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, మండల ఇంజనీర్ సుబ్రమణ్యం, ఈఓపీఆర్‌డీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు

వడ్డెరలకు అన్ని రంగాల్లో అవకాశం

రాయచోటి టౌన్: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న వడ్డెరల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉన్న కులాల్లో రెండు, మూడు స్థానాల్లో వడ్డెర కులం ఉందన్నారు. ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక గౌరవాధ్యక్షుడు దేరంగుల రమణయ్య, లీగల్ అడ్వైజర్ టీ. ఈశ్వర్, రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి రెడ్డెయ్య, న్యాయవాదులు డీ. నాగముని, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

చిన్నమండెం: మండలంలోని నాగిరెడ్డిగారిపల్లెలో సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేశారు. నాగిరెడ్డి పల్లెలో బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేస్తామన్నారు.

చిన్నమండెం: బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించి,సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

చిన్నమండెం: చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో కడప డీఈవో షేక్. షంషావుద్దీన్, సంబేపల్లె తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి మంత్రిని కలిశారు.

'గురుకులాల్లో వెట్టి చాకిరీ'పై చర్యలు తీసుకోవాలి

రాయచోటి కలెక్టరేట్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గురుకుల పాఠశాలలను గాలికి వదిలేసిన డీఈవో, జీసీడీవోలను సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పీటీఎం గురుకుల పాఠశాల ఎస్వో విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయించుకోవడమే కాకుండా కులం పేరుతో దూషిస్తోందని విద్యార్థు లు, తల్లిదండ్రులు ఆడిట్ కమిటీ ముందు వాపో తున్నారని విమర్శించారు. మొలకల చెరువు గురుకుల పాఠశాలలో స్నానం చేసేందుకు వంద రూపాయలు, సౌకర్యాలు కావాలంటే 500 రూపా యలు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతు న్నారని వివరించారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో), గర్ల్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ (జీసీడీవో)లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భారీగా ముడుపులు వస్తున్నందున డీఈవో, జీసీడీవోలు అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

రాజంపేట టౌన్: మొలకల చెరువు కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులపై జరుగుతున్న అరాచకాలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మంగళవారం పట్టణంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లావ్యాప్తంగా కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల్లో తనిఖీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు, వర్కర్ల మధ్య విభేదాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మొలకల చెరువు కేజీబీ వీ పాఠశాలలో జరిగిన సామాజిక తనిఖీలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట ఎస్ఎఫ్ఐ నాయకులు వై.వెంకటేశ్వర, పురుషోత్తం, బాలాజి, విష్ణువర్ధన్, గోపీచంద్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలోని అరాచకాలపై నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

చిట్వేలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పాతచిట్వేలిలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సేవాసంఘం మండల యువత ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, స్థానిక ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ముక్కా వరలక్ష్మి అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. 10.30 గంటలకు త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. మధ్యాహ్నం రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం నాదస్వరం, డోలు కళాకారులను పొందలూరు సుబ్బరాయుడు సన్మానించారు. సాయంత్రం పెద్దపల్లి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో చిన్నపిల్లల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. నాయీ బ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గ సభ్యులు పి.వెంకటసుబ్బయ్య, పెద్దపల్లి సుబ్బరాయుడు, పొందలూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

రాజంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును జనసేన పార్టీ నాయకుడు రామా శ్రీనివాసులు పరిశీలించారు. మెనూ వివరాలు, సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులను అభినందించారు.

ఆధార్‌కార్డులు మంజూరు చేయాలి

రాజంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డులు లేవంటూ మండల పరిధిలోని అత్తిరాల ఎన్టీఆర్ ఎస్టీ కాలనీకి చెందిన సుమారు 60 మంది రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. వెంటనే ఆధార్ కార్డులు మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఒంటిమిట్ట సమస్యలపై ఫిర్యాదు

రాజంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట సమస్యలపై స్థానిక టీడీపీ నాయకులు విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో వందలాది ఎకరాల భూములను కబ్జా చేశారని, విచారణ చేయించి భూములను స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదుల విభాగంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, ఉపాధ్యక్షుడు మౌలాలి, బీసీ నాయకుడు వడ్డె వెంకటరమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో నష్టాలపై అవగాహన

వీరబల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): జిల్లా పిల్లల సంరక్షణ యూనిట్ సోషల్ వర్కర్ శైలజ, అవుట్ రీచ్ వర్కర్ సురేశ్ సానిపాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాతో గ్రామీణులకు భరోసా

చిట్వేలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ తపాల జీవిత బీమా గ్రామీణ ప్రజలకు మంచి భరోసా అని రాజంపేట సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. చిట్వేలి సబ్‌పోస్టాఫీసు పరిధిలోని అనుంపల్లె బ్రాంచ్ పోస్టాఫీసులో ఎం.రమణమ్మకు మంగళవారం రూ. 2.28 లక్షల చెక్కును అందజేశారు. ఈమె భర్త ఎం.చంద్రశేఖర్ ఇటీవలే గుండెపోటుతో మరణించారు. ఈ కార్యక్రమంలో పీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, చిట్వేలి సబ్ పోస్ట్‌మాస్టర్ ఎస్.హరికృష్ణ, సబ్‌డివిజన్ మెయిల్ ఓవర్‌సీస్ సుబ్రమణ్యం, అనుంపల్లె బ్రాంచ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలను తెలుసుకోవాలి

పుల్లంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు ఆనద్‌కుమార్, సుబ్బరామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో విధాన్‌సే సమాధాన్, జాతీయమహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మహిళలు న్యాయ సహాయం ఎలా పొందాలి, ఎక్కడ పొందాలి, ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్‌గౌడ్, ఈవోఆర్డీ ముత్తయ్య, ఏపీఎం వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం?

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని ఓ దుకాణంలో మంగళవారం 150 కల్తీ మద్యం సీసాలను జిల్లా ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో ఒకరిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వివరాల కోసం అధికారులను కోరగా సమగ్రంగా విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

నగలు, నగదు అపహరణ

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో ఇంట్లో దొంగలు పడి 40 గ్రాముల బంగారు, 150 గ్రాముల వెండి ఆభరణాలు దొంగలించినట్లు పట్టణంలోని సోడిశెట్టినగర్‌కు చెందిన మద్దిన ప్రమీల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటికి తాళంవేసి మండలంలోని చియ్యవరం గ్రామానికి పిల్లలతో కలిసి వెళ్లానని, పైపోర్షన్ ఉండే వ్యక్తులు ఇంటి తాళాలు తెరిచి ఉండడం గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఇంటి వచ్చి చూశానని ఫిర్యాదులో పేర్కొంది. ఇంట్లో వస్తువులు చెల్లా చెదురుగా ఉండడంతో బీరువా తెరిచి ఉండడంతో పరిశీలించగా, అందులో ఉన్న బంగారం, వెండి వస్తువులు అపహరించుకు వెళ్లినట్లు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉద్యమం

రాయచోటిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉద్యమిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో రైల్వేకోడూరులో జరగనున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా మహాసభల కరపత్రాలను మంగళవారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు, గ్రీన్ అంబాసిడర్లు, వాచ్‌మెన్‌కు ఉద్యోగ భద్రత కల్పించి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హమాలీలకు పెంచిన కూలి ధరలు తక్షణమే అమలు చేయాలని, ఎరియర్స్ ఇవ్వాలని కోరారు. అర్హులైన కార్మికులందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ, నగర ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బజారు హమాలీలు, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్తమ అధ్యాపకుడికి ఘన సన్మానం

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ గ్రంథాలయ అధ్యాపకుడిగా ప్రశంస పత్రాన్ని అందుకున్న కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కే. ప్రసాద్ వర్మను కళాశాల ప్రిన్సిపాల్ వై.నరసింహ మూర్తి, అధ్యాపక బృందం మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలు నిబద్ధతను కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

రాయచోటిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి రాము సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని జిల్లా ప్రజారవాణా కార్యాలయంలో అద్దె బస్సుల యజమానులతో మాటాడుతూ బస్సులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కండిషన్‌లో పెట్టుకోవాలన్నారు. ప్రయాణికులు చేయి ఎత్తినా బస్సు ఆపడం లేదనే ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



బస్సుల యజమానులతో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి రాము

అర్జీదారులకు న్యాయం చేయండి

పుల్లంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోం నిదియాదేవి ఆదేశించారు. మంగళవారం ఆమె పుల్లంపేట తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో్ సీఎంవోపీజీఆర్ఎస్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారని ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. సీఎంవో నుంచి 14 దరఖాస్తులు రాగా అందులో 9 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీజీఆర్ఎస్‌లో 40 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అందుకు కారణాలేమిటని ప్రశ్నించారు. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరవిందకిషోర్, సుశీల్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి

'రోడ్డు భద్రత'పై అవగాహన అవసరం

రామాపురం, జనవరి28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అవసరమని జిల్లా యువజన అధికారి మణికంఠ అన్నారు. బండపల్లి పంచాయతీ పరిధిలోని బిట్స్ కాలేజీ ప్రాంగణంలో రోడ్డు భద్రత నియమాలపైన నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ మాట్లాడుతూ యువత ఆవేశం తగ్గించుకొని ఆలోచన వైపు నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు టీషర్టులు, టోపీలు, ట్రాఫిక్ రూల్స్ కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్ర, సురేంద్రారెడ్డి, నెహ్రూ యువ కేంద్ర సంస్థ సభ్యులు బాలాజీ, లక్ష్మినారాయణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఏఎంసీ, జిగురు అట్టల పంపిణీ

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో మంగళవారం 20 మంది రైతులకు ఏఎంసీ, జిగురు అట్టలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, యోహాన్ మాట్లాడుతూ బొప్పాయి తోటకు ఎకరాకు 15 నుంచి 20 చొప్పున జిగురు అట్టలు అడుగు ఎత్తున పెట్టడం ద్వారా రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గించవచ్చన్నారు. ఒక కేజీ ఏఎంసీ జీవన ఎరువును 100 కేజీల పశువుల ఎరువుతో కలిపి మొక్కల మొదళ్ల వద్ద వేస్తే మొక్కకు పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కవిత, మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు సుధాకర్, భాస్కర్, గ్రామ ఉద్యాన అధికారులు లక్ష్మి నారాయణ, సుధాకర్ వర్మ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు తగ్గించాలని అన్నమయ్య జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి కోరారు. నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోనంపేట, లక్కిరెడ్డిపల్లె సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల పని తీరు మెరుగుపరుచుకోవాలన్నారు.ఎంపీడీవో రెడ్డెయ్య, సీడీపీవో పద్మావతి, నీతి అయోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు దాదబీ, తులసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాలివీడు మండల సమావేశం

గాలివీడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. ఇటీవల ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. మంగళవారం ఎంపీడీవో జవహర్‌బాబు, ఎస్ఐ రామకృష్ణతో సమావేశమై శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు తప్ప ఇతరులెవరూ కార్యాలయంలోకి రాకూడదని సూచించారు.

పుల్లంపేట : పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏవో శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అదికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

సిద్దవటం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలంటూ సిద్దవటం టీడీపీ నేతలు సోమవారం రాత్రి వెలగపూడిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మాచుపల్లి ఖాదర్‌బంగ్లా వంతెన పనులు ప్రారంభించాలని సీఎంను కోరగా , ప్రతి వాగ్దానం అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ జవహర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఒంటిమిట్ట సీఐ బాబు హెచ్చరించారు. మండలంలోని వెలుగుపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్లు రిసీవ్ చేసుకోరాదన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

పదో తరగతి మోడల్ ప్రశ్నపత్రాలు విడుదల

పుల్లంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మార్సీ భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో చక్రధర్‌రాజు మంగళవారం 10వ తరగతి మోడల్ ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ప్రశ్నపత్రాలు తయారు చేసి విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఎంఈవోగా పురస్కారం అందుకున్న చక్రధర్‌రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణ, రమణమూర్తి, శంకరయ్య, నరసయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

రాజంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీ లో మూడు రోజుల పాటు ఎన్‌సీసీ శిక్షణ శిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన ఆంధ్ర గర్ల్స్ ఎన్‌సీసీ బెటాలియన్ నిర్వాహకులు నాయబ్ సుబేదార్, వెంకటేశ్, సీహెచ్‌ఎం కర్నాల్‌సింగ్ శిక్షణ ఇచ్చారు. 150 మంది కేడెట్లు పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ పి. నాగముని, దీప్తి, సైపుల్లా పాల్గొన్నారు.

కన్నీటి..కర్బూజ..!

- పంటను దెబ్బతీసిన వైరస్...ప్రతికూల వాతావరణం
- లోపల తెల్లగా గూడు కట్టడంతో తినేందుకు పనికిరాని కాయలు
- కోయకుండా పొలాల్లో వదిలేస్తున్నవైనం
- భారీగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడులు కూడా రాక రైతులకు తీవ్ర నష్టం


కాయ లోపల తెల్లగా గూడుకట్టి తొర్రగా ఉన్న దృశ్యం


వేపూరికోట సమీపంలో వైరస్ సోకడంతో పొలంలో వదిలేసిన కర్బూజ కాయలు

ములకలచెరువు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కర్బూజ పంట రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను వైరస్...ప్రతికూల వాతావరణం కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పంట సాగు చేసిన ప్రారంభంలో వరుసగా వచ్చిన తుఫాన్లతో వర్షాలు కురవడం...విపరీతమైన మంచు..ఎండ లేకపోవడంతో వైరస్‌లు చుట్టుముట్టాయి. నివారణకు ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా కాయ లోపల తెల్లగా గూడు కట్టి గట్టిగా తొర్ర ఏర్పడడంతో తినడానికి పనికిరాకుండా పోయాయి. దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. దీంతో అంతంతమాత్రంగా దిగుబడి రావడంతో చేసేది లేక కాయలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చు చేశారు. గత ఏడాది అక్టోబరు, నవంబరు మొదటి వారంలో పంట సాగు చేశారు. డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్ కారణంగా ఎండకాయకపోవడంతో వైరస్‌లు విపరీతంగా సోకాయి. దీంతో రైతులు పలు రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. కాయలు సైజు రాకపోగా వైరస్ కారణంగా లోపల తెల్లగా గూడు కట్టి గట్టిగా ఉంది. 80 శాతం కాయలు వైరస్ బారిన పడి తినడానికి వీలు లేకుండాపోయింది. దీంతో వ్యాపారులు పొలాల వద్దకు వచ్చి మంచి కాయలు మాత్రమే కోసుకెళ్లి వైరస్ సోకిన కాయలు వదిలేస్తున్నారు. వైరస్ సోకిన కాయలు పనికి రాకుండా పోవడంతో రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు.

ఎకరాకు మూడు టన్నులకులోపే...

వైరస్, ప్రతికూల వాతావరణంలో కర్బూజ దిగుబడి కూడా భారీగా తగ్గింది. గత ఏడాది ఎకరాకు రూ.10 నుంచి 15 టన్నుల కాయల దిగుబడి వచ్చింది. ఇప్పుడు మాత్రం ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల లోపు మాత్రమే దిగుబడి వస్తోంది. అలాగే గత ఏడాది కాయ సైజు ఎనిమిది నుంచి 12 కేజీల వరకు ఉండేది. ప్రస్తుతం కాయ సైజు ఏడు కేజీల లోపే ఉంది. దీనిని బట్టి చూస్తే దిగుబడి ఎంతమాత్రం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే ధర కూడా తగ్గుముఖం పట్టింది. వారం రోజుల క్రితం వరకు కేజీ రూ.17 పలికిన ధర ప్రస్తుతం రూ.10 నుంచి రూ.12 మాత్రమే ఉంది.

రూ.5 లక్షలు ఖర్చు చేస్తే...రూ.4లక్షలు నష్టం..



ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ గురికివారిపల్లెకు చెందిన రైతు బాలాజీ నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడు. సాగు ఖర్చు రూ.5 లక్షలు పెట్టుబడి ఖర్చు వచ్చింది. వాతావరణం అనుకూలించక వైరస్ సోకి, అధిక మంచు కారణంగా దిగుబడి భారీగా తగ్గిపోయింది. నాలుగు ఎకరాలకు రూ.లక్ష మాత్రమే వచ్చింది. రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే రూ.4 లక్షలు నష్టం వచ్చింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిక పంట రైతును కష్టాల్లో ముంచింది. ప్రభుత్వం ఆదుకోవాలని కర్బూజ రైతులు వేడుకుంటున్నారు.

మూడు ఎకరాలకు..
ఐదు టన్నుల దిగుబడి వచ్చింది



ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన రైతు మూగి రవిచంద్ర మూడు ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశాడు. దీనికి రూ.3.50 లక్షలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. 30 టన్నులకుపైగా రావాల్సి దిగుబడి కేవలం ఐదు టన్నులు మాత్రమే వచ్చింది. ఉన్న కాయల్లో 90 శాతం కాయలు వైరస్ బారిన పడ్డాయి. కాయ కోసి చూస్తే లోపల తెల్లగా గూడుకట్టి గట్టిగా ఉంది. ఐదు టన్నులకు ప్రస్తుతం ఉన్న ధరను బట్టి రూ.60 వేలు వచ్చింది. ఈ రైతుకు రూ.2.90 లక్షలు నష్టం వచ్చింది. వరుసగా ఏడేళ్లుగా పంట సాగు చేస్తున్న ఈ రైతుకు ప్రస్తుతం వచ్చిన నష్టం ఎప్పుడూ రాలేదు.

అధికారులు బోర్డు నాటారు.. కబ్జాదారులు తీసేశారు

- ప్రభుత్వ స్థలం అని నాటిన బోర్డును మాయం చేసిన వైనం
- సోమవారం రాత్రి గుట్ట చదును



ప్రభుత్వ స్థలం అని పది రోజుల క్రితం తహసీల్దార్ ఏర్పాటు చేసిన బోర్డు - బోర్డు తీసేసి సోమవారం రాత్రి గుట్ట చదును చేసిన దృశ్యం

సుండుపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని కంచిపాటివాండ్లపల్లె జగనన్న కాలనీ సమీపంలో పది రోజుల క్రితం కొందరు కబ్జా చేసేందుకు గుట్టను చదును చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దైవాదీనం ఇది ప్రభుత్వ స్థలమని, ఇతరులకు ఈ స్థలంలోకి అనుమతి లేదని బోర్డు నాటించారు. అయితే సోమవారం రాత్రి కొందరు ఆ బోర్డును తొలగించి యంత్రాలతో గుట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లతో తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలం అని అధికారులు బోర్డు నాటినా ఆక్రమణదారులు లెక్కచేయకుండా ఆ బోర్డును తొలగించి గుట్టను చదును చేస్తుండటం గమనార్హం. బోర్డు తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, చెరువులు, కుంటలు ఆక్రమణలు జరగడం వెనుక సరైన చర్యలు లేకపోవడమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఆ స్థలం చదును చేసింది ఎవరో కూడా రెవెన్యూ అధికారులకు తెలుసని అయినా వారిపైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

వెంటనే బోర్డు నాటిస్తాము

గుట్టను ఆక్రమించినట్లు సమాచారం రావడంతో గతంలో బోర్డు ఏర్పాటు చేయించాము. ఆ బోర్డును ఎవరు తొలగించారో తెలియదు. వెంటనే ఆ స్థలంలో బోర్డు తిరిగి ఏర్పాటు చేస్తాము.

\- దైవాదీనం, తహసీల్దార్

కార్పెంటర్ ఆత్మహత్య


కార్పెంటర్ రవి మృతదేహం

కురబలకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన రవి (25) కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇంటి స్థలం విషయమై తన సమీప బంధువులతో వివాదం నెలకొంది. దీంతో మనస్థాపానికి గురైన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రి వేడుకలకు కలెక్టరుకు ఆహ్వానం

బి.కొత్తకోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ ఆశ్రమంలో నిర్వహించే శివరాత్రి వేడుకలకు విచ్చేయాలని బి.కొత్తకోట మండలం బీరంగి వద్ద వెలసిన బండెన్నస్వామి ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి కలెక్టరు శ్రీధర్‌ను ఆహ్వానించారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టరేట్‌కు వెళ్లి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా బండెన్న స్వామి ఆలయం గురించి కలెక్టరుకు పీఠాధిపతి వివరించారు. ఆయన వెంట పలువురు అధికారులు, అనుచరులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

సిద్దవటం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం పోలీసుస్టేషన్ పరిధిలోని మంగళవాండ్లపల్లెలో 2013లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారు. అంత్యం సుబ్బయ్య, అంత్యం సురేష్ అనే నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

భార్యాభర్తలపై దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రమణారెడ్డి, లక్ష్మీదేవమ్మ

పెద్దతిప్పసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తి ఇంట్లోకి జొరబడి భార్యాభర్తలను తీవ్రంగా గాయపరిచిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాపూరివాండ్లపల్లె పంచాయతీ డి.నారాయణపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు జల్లు వెంకట్రమణారెడ్డి, ఆయన భార్య లక్ష్మీదేవమ్మ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రతాప్‌రెడ్డి ఆ దంపతులపై దాడి చేశాడు. గురువారం పట్టపగలు వెంకట్రమణారెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు ఇంటిలో ఉండగా అదే గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే యువకుడు ఇంట్లోకి జొరబడి ఆ ఇరువురిపైన విక్షణారహితంగా దాడి చేశాడు ఇంటిలోనుంచి వారిని బయటకు లాగి కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దుతూ బీభత్సం సృష్టించాడు స్థానికులు మందలిస్తున్నా వినకుండా ఆ దంపతులపై దాడి చేసి కొట్టి గాయపరిచాడు ఆ దంపతుల అరుపులు విని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంకట్రమణారెడ్డి కుమారుడు నాగిరెడ్డి బెంగళూరు నుంచి తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి జరిగిన సంఘటనను తెలుసుకుని పోలీసులకు ప్రతాప్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు దంపతులపై దాడి చేసిన ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం పీటీఎం ఎస్ఐ రవికుమార్ తెలిపారు. తన గురించి మాట్లాడుతున్నారని వేరే వ్యక్తులు అతనికి చెప్పడంతో వారిపై విచక్షణారహితంగా దాడి చేశాడన్నారు. గతంలో ప్రతాప్‌రెడ్డిపై మర్డర్ కేసు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. గత నెల క్రితం రంగసముద్రం పంచాయతీ కొత్తసుబ్బరాయుని గ్రామానికి చెందిన ఓ మైనార్టీ కుటుంబంపైన దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మదనపల్లె సమస్యలు పరిష్కరించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి టీడీపీ, జనసేన నాయకుల విన్నపం


మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి మదనపల్లె టీడీపీ, జనసేన నాయకులు విన్నవించారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలసిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన రాయలసీమ కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సురేంద్రయాదవ్ సమస్యల గురించి వివరించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సమస్యలు, పార్టీ నాయకుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై త్వరలోనే సమీక్షించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మేకల రెడ్డిశేఖర్, నిమ్మనపల్లె రమణ పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు ప్రయోజనం

- డీహెచ్‌వో రవిచంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

కలకడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తిదారుల సంఘాలతో మామిడి, టమోటా రైతులకు ప్రయోజనం కలుగుతుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. కలకడలో మంగళవారం ఆయన రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మండల రైతులకు సౌకర్యంగా ఉద్యానవనశాఖ, బీఆర్ఈడీఎస్ ఎన్‌జీవో (ఐపీసీ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో రైతు సంఘాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో మొదట పది మందితో బోర్డు ఆఫ్ డైరెక్టర్లను ఎన్నుకోవడం తరువాత సంఘాన్ని కంపెనీ యాక్ట్ కింద రిజిష్టర్ అవుతుందన్నారు. ఇందులో సభ్యత్వం పొందేందుకు టమోటా, మామిడి రైతులు అర్హులన్నారు. పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేలా ఐపీసీ మార్కెట్ లింకేజీ కొనుగోలుకు తోడ్పడుతుందన్నారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో కుమార్‌రెడ్డి, ఐసీపీ ప్రతినిధి భోజరాజు, రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి


వేరుశనగను పరిశీలిస్తున్న డీఏవో చంద్రానాయక్

కలకడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్‌లో నమోదైన ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కలకడ మండల కేదొడ్డిపల్లె రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లు ఉన్న రైతులు ఎస్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు పొందాలన్నారు. అనంతరం దేవళపల్లె, ఎనుగొండపాలెం, ముడియంవారిపల్లె గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంట విస్తీర్ణాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అలాగే రైతులకు పంట సాగుపై తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామయ్యచౌదరి, ఏవోలు లావణ్య, వెంకటమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..

- నేటి నుంచి ఫిబ్రవరి 3 వరకు కోసువారిపల్లె వెంకన్న ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం
- ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు
- ముస్తాబవుతున్న వెంకన్న ఆలయం

తంబళ్లపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలకు సుందరంగా ముస్తాబవుతోంది. రెండు ఉత్సవాలు ఒకదాని తర్వాత ఒకటి ఉండటంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ఉత్సవాల ఆహ్వాన పత్రికలను తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని జేఈవో కార్యాలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ ఆవిష్కరించారు. ఈనెల 29 తేదీ సాయంత్రం టీటీడీ వేదపండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ నూతన రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవానికి అంకురార్పణ చేపట్టనుండగా, ఫిబ్రవరి 2 వరకు ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు, 3వ తేదీ ఉదయం చతుష్టానార్చన, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, ఉదయం 9:30 నుంచి 10.15 వరకు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, కుంభప్రోక్షణ, శాత్తుమొర, నివేదన, మంగళహారతి, ఆచార్య బహుమానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం కానుండగా..12 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవంతో పాటు, శ్రీవారి వాహన సేవల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఆలయం లోపల, వెలుపల టీటీడీ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో పాటు స్వామి వారి విద్యుత్‌దీప కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి కళాకారులు రంగురంగుల ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళవారం నాటికి ఏర్పాట్లు పూర్తవుతాయని ఆలయ అధికారి దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్ తెలిపారు.


తీర్చిదిద్దుతున్న రంగవల్లులు కళాకారుడు


ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి

ఆలయ స్థల పురాణం..

క్రీస్తు పూర్వం 14వ శతాబ్దంలో వేంగి చోళ మహారాజు కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామిని ప్రతిష్ఠించినట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. విజయనగర సామ్రాజ్యానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు కుటుంబీకులైన అచ్యుతదేవరాయలు, కంభం తిమ్మరాజు స్వామి వారికి అనేక సువర్ణాభరములు చేసి అనేక మాన్యములు దానమిచ్చినట్లుగా శాసనంలో ఉంది. చోళ మహారాజు ఒకరోజు రాత్రి ఈ ప్రదేశం (ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశం)లో బస చేయగా స్వామి వారు కలలోకి వచ్చి ఈ ప్రదేశంలో ఆలయం నిర్మించమని కోరగా వెంటనే చోళ మహారాజు ఆలయం నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. తాళ్లపాక అన్నమాచార్యులు కూడా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని అనేక సంకీర్తనలు రచించినట్లు పురాణాలు చెపుతున్నాయి.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ఇలా..

ఫిబ్రవరి 3వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అంకురార్పణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 4న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఉత్సవం, 5న ఉదయం శేష వాహనము, రాత్రికి హంస వాహనం, 6న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనం ఉంటాయి. 7వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, 8న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 9న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, అనంతరం 10:30 గంటలకు గరుడ వాహన సేవ, 10న ఉదయం రథోత్సవం, రాత్రి గజవాహనం, 11న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి అశ్వవాహనంపై స్వామి వారు విహరించనున్నారు. 12న ఉదయం 7 నుంచి 9 గంటల నడుమ వసంతోత్సవం, 11:30 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం, 13న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 8 గంటల మధ్య పుష్పయాగంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారికి వాహన సేవలు ఉదయం 8 గంటల రాత్రి 8 గంటలకు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకూ స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.


నూతనంగా నిర్మించిన కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ రాజగోపురం

ఇసుక రీచ్‌ను తలపిస్తున్న దేవగుడి పెన్నానది

● అడ్డూ అదుపు లేకుండా ఇసుక రవాణా
● నిద్రావస్థలో అధికారులు



దేవగుడి పెన్నానదిలో ఇసుక నింపుతున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో అధికారులు నిద్రావస్థ వీడాలని పలుప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రొద్దుటూరు రోడ్డులో పెన్నానది పరిసర ప్రాంతాలన్నీ ఇసుక రీచ్‌లు తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.సుగుమంచిపల్లె గ్రామం పెన్నానది నుంచి దేవగుడి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూలు వెనుకభాగాన రాత్రి, పగలు ఇసుక తరలిపోతోంది. ఇసుక అక్రమ రవాణా గురించి స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు ఫొటోలు తీసి సమాచారం ఇచ్చినా ఏ ఒక్క అధికారీ భయంతో రావడం లేదని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు రోడ్డులో రాత్రి టిప్పర్ల ద్వారా ఇసుక తరలిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దానవులపాడు పెన్నానదిలో దేవగుడి, పి.సుగుమంచిపల్లె తదితర గ్రామాల్లో భారీగా ఇసుక తరలిపోతోందని ఆ ప్రాంతీయులు వాపోతున్నారు. ముద్దనూరు రోడ్డులో పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, గూడుమస్తాన్‌వలి దర్గా వెనుక భాగాన మున్సిపాలిటీకి సంబంధించిన కంపోస్టు యార్డు సమీపంలో, మోరగుడి గ్రామం టీచర్స్ కాలనీ, రచ్చబండ వద్ద మైలవరం మండలం దొమ్మరనంద్యాల, వేపరాల గ్రామాల్లో జోరుగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అవసరం లేకున్నా పొలాల్లో, ఖాళీ స్థలాల్లో ఇసుక ట్రాక్టర్ల యజమానులు డంప్ చేసి అక్కడి నుంచి లారీల్లో, టిప్పర్లలో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో చుట్టుపక్కల గ్రామాలకు పెన్నానదిలో ఉండే బోర్లకు నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, అధికారులు నిద్రావస్థను వీడి కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థి చెయ్యి విరగడంపై విచారణ



విద్యార్థిని విచారిస్తున్న ఎంఈఓ శోభారాణి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వసంతపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి శివరాంను ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చెయ్యి విరిగిన సంఘటనపై ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి విచారణ జరిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి 23వ తేదీ పాఠశాలకు పుస్తకాలు తీసుకురాలేదని ఆగ్రహించిన సైన్స్ ఉపాధ్యాయుడు మురళి ఆ విద్యార్థిని కొట్టాడు. దీంతో ఆ విద్యార్థి చెయ్యి విరిగింది. ఈ సంఘటనపై విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ షంషుద్దీన్ విచారణకు ఆదేశించారు. డీఈఓ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో ఎంఈఓలు విద్యార్థి శివరాం, తండ్రి మహేష్‌ను విచారించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ డీఈఓ ఆదేశాల మేరకు బుధవారం మరోసారి పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులుతో విచారించి డీఈఓకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుజాత, ప్రజా సంఘాల నేతలు ఓబులేసు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గోపవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బద్వేలు శరత్‌కుమార్ (22) మృతి చెందాడు. శరత్‌కుమార్ జీవనోపాధి కోసం శ్రీనివాసపురం వద్ద పెట్రోలు బంకులో పనిచేస్తుండేవాడు. డ్యూటీ ముగించుకుని ఇంటికి బైక్‌లో వస్తుండగా నెల్లూరు రోడ్డులో ఆర్టీసీ బాడుగ బస్సు ఢీకొంది. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే గాయపడిన యువకుడికి చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని బస్సు యాజమాన్యంతో పలుమార్లు సంప్రదించినా ఫలితంలేదు. తాము చేసేదేమీ లేదంటూ యాజమాన్యం స్పందించపోవడంతో యువకుడికి సరైన చికిత్స అందక మృతి చెందినట్లు బాధితులు ఆరోపించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

గుర్రంకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్‌తో లైన్‌మన్‌కు గాయాలైన సంఘటన ఎల్లుట్ల పంచాయతీ పసలవాండ్లపల్లెలో జరిగింది. స్థానికుల కథనం మేరకు ఎల్లుట్ల లైన్‌మన్‌గా మన్సూర్ అలీ ఏడాదిగా పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగా సోమవారం పసలవాండ్లపల్లె రైతు వెంకటరమణారెడ్డి పొలం ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ పోయిందని సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని ఫ్యూజ్ వేస్తుండగా కరెంట్ సరఫరా అయింది. దీంతో షాక్‌కు గురైనట్లు తెలిపారు. ప్రమాదంలో అతడికి నడుము కింద కరెంట్ వైర్లు తగలడంతో కాలింది. గమనించిన రైతులు వెంటనే అతడిని గుర్రంకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై సబ్ ఇంజనీర్ మౌసిన్ వివరణ కోరగా లైన్‌మన్ కరెంట్ షాక్‌కు గురైన విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లారీ... చోరీ...

రైల్వేకోడూరు రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కుక్కలదొడ్డి ప్రధాన రహదారిపై నిలుచున్న 12 చక్రాల లారీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని లారీ డ్రైవర్ బాల వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి ఐరన్‌లోడుతో వెళ్తూ కుక్కలదొడ్డి వద్ద భోజనం చేసి రాగా లారీ దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

అతివేగం - ప్రమాద సంకేతం

నైపుణ్యం చూపే తాపత్రయం ● బైక్‌ను అదుపు చేయలేని వయస్సు ● ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేని వైనం
నెత్తురోడుతున్న రోడ్లు ● ప్రాణాలు కోల్పోతున్న యువత ● కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు



వయసుకు మించిన బరువైన వాహనం (బుల్లెట్)లో యువకుడు

బద్వేలుటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రకరకాల మోడళ్లలో ద్విచక్ర వాహనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. వాటి రంగులు, వేగం యువతను ఆకట్టుకుంటుండడంతో ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేమితో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. అతి వేగం ప్రమాద సంకేతం అంటూ పెద్దలు అరుస్తున్నా తను నడుపుతున్న వాహనంపై నైపుణ్యాన్ని ప్రదర్శించాలనే తాపత్రయంలో అతి బరువైన బైక్‌ను అదుపు చేసే వయస్సు చాలక ప్రమాదాల బారిన పడుతున్నారు. నెత్తురోడుతున్న రోడ్లను చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. నిత్యం రోడ్ల ప్రమాదాలు జరుగుతున్న విధానాలు చూస్తున్నా యువత అతివేగంగా బైక్‌ను నడుపుతుండడంతో వారికి ఎదురొచ్చిన వాహనాలు సైతం ప్రదాలకు గురవుతున్నాయి. అతివేగం, ఆవేశం ఏది ఎక్కువైనా మూల్యం చెల్లించుకోక తప్పదని కాలం చెబుతూనే ఉంది. ద్విచక్రవాహనాలు నడిపేందుకు నేటి కుర్రకారు ఆసక్తి కనబరుస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వాహనాన్ని వేగంగా నడుపుతూ అడ్డూ అదుపులేకుండా దూసుకెళుతున్నారు. సరదా షికారు మోజులో ప్రాణాలమీదకు తెచ్చుకుంటూ తల్లిదండ్రులకు గర్భశోకం మిగుల్చుతున్నారు.

అతివేగంతో పోతున్న ప్రాణాలు

చేతిలో వాహనం ఉంటే హద్దులు మరచిపోతున్నారు. ఇంట్లోవారికి తెలియకుండా బయటకు తీసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ రయ్...రయ్ మంటూ యువత రోడ్లపైకి వస్తున్నారు. ఈ క్రమంలో వేగాన్ని అదుపుచేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నారు. సినిమా హీరోల్లా చేతులువదిలి డ్రైవింగ్‌చేస్తూ పట్టుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్కవాహనం మీద ముగ్గురూ లేదా నలుగురు కూర్చుని గాల్లో తేలిపోతున్నట్లు అతివేగంగా, అడ్డదిడ్డంగా నడుపుతూ పాదచారులు, వాహనదారులు, ఎదురుగా వస్తున్నవారిని గాయపరుస్తూ వీరూ ప్రమాదాల భారినపడి కాళ్లు చేతులు విరిగిపోవడంతో వికలాంగులుగా మంచానికి పరిమితమవుతున్నారు.

చెడు అలవాట్లకు బానిసలవుతూ

దేశానికి, కుటుంబానికి వెన్నుదన్నులా ఉండాల్సిన నేటి యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ఎంజాయ్‌పేర్లతో పార్టీలు చేసుకుంటూ చెడుమార్గంలో పయనిస్తున్నారు. ద్విచక్ర వాహన దారులతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎటునుంచి ఏ వాహనం వస్తుందో.. ఎక్కడ తగిలి ప్రమాదాల భారినపడతామోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



సంక్రాంతి రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసుమంత్ (ఫైల్‌ఫొటో)

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

18 ఏళ్లలోపు పిల్లలు ద్విచక్రవాహనాలను నియంత్రించే సామర్థ్యాలు వారికి ఉండవు. మోటారు వెహికల్ చట్టాలు నిబంధనలపై అవగాహన ఉండదు. ద్విచక్రవాహనాల అనుమతులు పొందేందుకు అర్హులుకారు. విషయాలన్నీ తెలియజేసేందుకు రోడ్డు భద్రతా వారోత్సవాలు, సాధారణ రోజుల్లోనూ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో యువతకు అవగాహన లేకపోవడంతో, నిబంధనలు పాటించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు భారినపడడమే గాకుండా మృత్యువాతపడుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే ఎవరికీ వాహనాలు ఇవ్వరాదు. ముఖ్యంగా ద్విచక్రవాహనాలను పిల్లలకు ఇవ్వకూడదు. వారు ఓవర్‌స్పీడు వెళ్లడం, రైజింగ్‌చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. రహదారులపై రాంగ్ డ్రైవింగ్, హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడపడం, త్రిపుల్‌రైడింగ్ వంటివి చట్టరిత్యానేరం. తల్లిదండ్రులు జీవనోపాధికి గల్ఫ్‌దేశాలకు వెళ్లి, ఇంటి వద్ద పిల్లల బాధ్యతను అవ్వాతాతలకు అప్పగిస్తుండడంతో పిల్లలు ఎవరికీ తెలియకుండా వాహనాలను ఎలాపడితే అలా నడుపుతూ ప్రమాదాల భారినపడుతూ వందేళ్ల జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. రోడ్డుభద్రతలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా, నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడుపుతున్నారు. అట్టివారిపై కేసులు నమోదు చేస్తున్నాం. తల్లిదండ్రులు, పిల్లలపట్ల జాగ్రత్తలు వహిస్తూ, విలువలు నేర్పిస్తూ మంచినడవడికతో పిల్లలను పెంచాలని.

రాజగోపాల్, బద్వేలు అర్బన్ సీఐ

'వైఎస్'కు వెన్నుదన్ను 'దేవగుడి'

ఆది చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక విమర్శలు ● జీవితమంతా డమ్మీగా మారొద్దు
విలేకరులతో కూటమి నేత గోనా పురుషోత్తం రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నేతలు గోనా పురుషోత్తంరెడ్డి, నాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతిసారీ వైఎస్ కుటుంబానికి అత్యధిక ఓట్లు తెప్పించి వారిని గెలిపించిన ఘనత దేవగుడి కుటుంబానిదేనని కూటమి నేత గోనా పురుషోత్తంరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ కార్యాలయంలో విలేకరులతో కూటమి నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఉన్నంతకాలం జమ్మలమడుగు అభివృద్ధి జరిగిందని, ఎమ్మెల్సీ రామసుబ్బారెడి మంత్రిగా ఉన్నా అభివృద్ధి చేశారా అంటూ సూటిగా ప్రశ్నించారు. దేవగుడి కుటుంబం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చేస్తున్న, చేసిన అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి వ్యవసాయం చేస్తానని చెప్పి రాజీనామా చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ చేసిన తప్పుడు అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాలుగు వేల మెజార్టీతో ఎంపీగా గెలిచినప్పుడు జమ్మలమడుగులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైఎస్ కుటుంబానికి అత్యధికంగా ఓట్లు వేయించి గెలిపించిన ఘనత ఆదిదేనన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి నిద్రావస్థలో లేకుండా హుషారుగా బయటకు రావాలని అప్పుడే చేసిన అభివృద్ధి తెలుస్తుందన్నారు. వైసీపీ హయాంలో జమ్మలమడుగులో అభివృద్ధి ఏమేరకు చేశారో ప్రకటించాలని ఆయన సవాల్ విసిరారు. టీడీపీ కూటమి నేతలు దేవగుడి యూత్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి అన్ని ప్రాంతాల్లో టిప్పర్లతో ఇసుకను బయటి ప్రాంతాలకు అమ్ముకుని వ్యాపారం చేశారన్నారు. గతంలో చంద్రబాబు ఆదేశాల మేరకు భూపేశ్‌రెడ్డి తామంతా కలిసి అంబవరం పెన్నానదిలో ఇసుక రీచ్ వద్దకు వెళ్లినప్పుడు నిరసన చేసి బయటకు వస్తే వైసీపీ వారు దారిలో అడ్డుకుని డ్రైవర్‌ను తామే కొట్టామని ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసు తమపై పెట్టారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రభుత్వ వసతి గృహాలు, రోడ్లు, కాల్వలు అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకున్నారన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చౌడం జొల్లు కొండయ్య, నవాబు పేట మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బెదిరింపు కాల్

వీరబల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వున్న వీరబల్లి తహసీల్దార్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీరు ఏం చేస్తున్నారు. ఎలా చేస్తున్నారు. మీతో మాట్లాడాలి. బయటకు రండి మేము వస్తున్నామని ఫోన్ చేసి అనడంతో ఆశ్చర్యానోయిన ఆమె దిక్కుతోచని స్థితిలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫోన్ చేసి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయం వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన సూచించడంతో తహసీల్దార్ రూరల్ సీఐ వరప్రసాద్‌కు తెలిపారు. వెంటనే ఆమెకు వచ్చిన బెదిరింపు కాల్ నెంబరు తీసుకుని ఫోన్ చేయగా ఎవరూ ఎత్తలేదు. దీంతో ఆన్‌లైన్‌లో పరిశీలించగా బెంగళూరు నుంచి వచ్చినట్లు, ఇది ఫేక్ కాల్ అంటూ తిరిగి చెప్పారు. పోలీసులు ఆరాతీస్తున్నట్లు తెలిపారు.

అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్ట్

రెడ్ శాండర్ టాస్క్‌ఫోర్స్



అరెస్టు చేసిన వ్యక్తితో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

వీరబల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): సానిపాయి అటవీ ప్రాంతంలో చొరబడుతున్న కొందరు వ్యక్తులను అడ్డుకుని రెండ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్ ఒక వ్యక్తిని అరెస్టు చేసింది. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేశ్ కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐటీ, విష్ణువర్ధన్‌కుమార్ టీం, స్థానిక ఎఫ్‌బీఓ అనిల్‌కుమార్ సహకారంతో వీరబల్లి మండలం సానిపాయి కేంద్రం నుంచి కూంబింగ్ చేపట్టారు. జాండ్రపెంట ఫారెస్టు బీట్ పరిధిలో కొరతుకోన వద్ద కొందరు అడవిలోకి చొరబడేందుకు ప్రయత్నం చేయగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చుట్టు ముట్టారు. అయితే వారిలో అందరూ పారిపోగా ఒక వ్యక్తిని పట్టుకున్నారు. అతనిది తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతన్ని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్ఐ రఫీ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్వేషణ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న మిట్స్ విద్యార్థులు

కురబలకోట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, అంగళ్ళు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అగస్త్య క్రియేటివ్ క్యాంపస్‌లో జరిగిన అన్వేషణ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. సీఎస్‌టీ రెండో ఏడాది విద్యార్థులు చందు, బాలాజీ కుప్పం అగస్త్య క్రియేటివ్ క్యాంపస్‌లో జరిగిన అన్వేషణ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనకు రూ.8వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. డేటా సైన్స్ తృతీయ ఏడాది విద్యార్థులు నౌషాద్, మనోజ్‌కుమార్, యువ జ్యోతి, శ్రావ్య, సాయి జశ్వంత్, సాయి బాలాజీలు కన్సొలేషన్ బహుమతులను సాధించారు. పతిభ కనబరచిన విద్యార్థుల ను కరెస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, విభాగాధిపతి కుసుమ అభినందించారు.

ఖాకీ క్రౌర్యానికి వ్యక్తి బలి

స్టేషన్ ఆవరణలోనే విషద్రావణం తాగిన గంగాధర్ ● ఎస్ఐ వేధింపులతోనే ఆత్మహత్య
శోకసంద్రంలో కుటుంబ సభ్యులు ● పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా





ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్ - పోలీసుస్టేషనుఎదుట ధర్నా చేస్తున్న కుటుంబీకులు

పులివెందుల టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాకీల క్రౌర్యానికి సామాన్యుడు బలి అయిన సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేధింపుల తాళలేక మోటున్నూతల పల్లె వాసి రెడ్డిబోయిన గంగాధర్ (30) పోలీసుస్టేషన్ ఆవరణలోనే విషద్రావణం తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే..

రెడ్డిబోయిన గంగాధర్ అదే గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణ. ఈ విషయమై పెద్దమనుషులు వద్ద పంచాయతీ కూడా జరిగింది. అయితే గడ్డం గంగాధర్ భార్యను ఇటీవల రెడ్డిబోయిన గంగాధర్ వేధింపులకు గురిచేసేవాడని ఇదే క్రమంలో 23న బైకుపై వస్తున్న గడ్డం గంగాధర్ తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో గాయాల పాలైన గడ్డం గంగాధర్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు వెదుకుతుండగా రెడ్డిబోయిన గంగాధర్ తప్పించుకుని తిరుగుతున్నాడు. కాగా హఠాత్తుగా మంగళవారం మధ్యాహ్నం రెడ్డిబోయిన గంగాధర్ పోలీసుస్టేషన్ ఆవరణలో ప్రత్యక్షమయ్యాడు. అప్పటికే ఎస్ఐ వేధింపులతో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెబుతూ విషద్రావణం తాగాడు. గమనించిన సిబ్బంది అతన్ని ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించిందని మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించాలని వైద్యులు తెలిపారు. అతన్ని కడపకు తరలిస్తుండగా మృతి చెందాడని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

రెడ్డిబోయిన గంగాధర్ మృతి చెందడంతో గంగాధర్ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇతడికి భార్య సౌజన్య, ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మా కుటుంబానికి దిక్కు ఎవరని రోదనలు పలువురిని కలచివేసింది.

స్టేషన్ ముందు ధర్నా



పోలీసుస్టేషన్ ఎదుట విషద్రావణం తాగుతున్న గంగాధర్

రెడ్డిబోయిన గంగాధర్ మృతి చెందడంతో తండ్రి క్రిష్టయ్య, తల్లి నరసమ్మ, భార్య సౌజన్య, ముగ్గురు కుమార్తెలు కుమారుడుతో కలిసి పోలీసుస్టేషను ఎదుట న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. దీంతో కుటుంబ సభ్యులను సీఐ పోలీసుస్టేషన్‌కు పిలిపించుకుని వాస్తవాలపై మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తానని చెప్పారు. మరి ఏ మేరకు ఆ కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

మనో వికాసానికి మార్గం ధ్యానం : వీసీ

కడప ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మనోవికాసానికి ధ్యానం టానిక్‌లా పనిచేస్తుందని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వర్సిటీ సైన్స్ బ్లాక్ సెమినార్ హాల్‌లో విశాఖపట్నంలోని దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొంది ప్రశాంతత ఇవ్వడంలో ధ్యానం సహకరిస్తుందన్నారు. దివ్య బాబాజీ సుషుమ్న యోగా ఫౌండేషన్ కార్యదర్శి ఆర్.శిరీష మాట్లాడుతూ ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. సుషుమ్న క్రియ అనేది నాలుగు రకాల ధ్యానాల కలయిక అని వివరించి అవగాహన కల్పించారు. కళ్లు కాకుండా కనుబొమ్మల మధ్య దృష్టి కేంద్రీకరించాలని, శ్వాసపై దృష్టి నిలపాలని సూచించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరం అండకు అనూహ్య స్పందన

- ఆంధ్రజ్యోతి చర్చా వేదిక విజయవంతం
- సమస్యలు విన్నవించిన జనం... ఆలకించిన అధికారులు
- అభివృద్ధి పనులకు కమిషనర్ హామీ



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, జనసేన మహిళా నేత దారం అనిత, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, పీటీఎం శివ ప్రసాద్

మదనపల్లె/మదనపల్లె టౌన్/అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. స్థానిక 30వ వార్డు పరిధిలోని ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్ ఏరియాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రెండు రోజుల పాటు వరుస కథనాలతో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. వీటిని పరిష్కరించేందుకు అధికారులు, పాలకులు, ఇటు ప్రజల మధ్య వారధిగా ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా స్థానిక కదిరి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాలులో మంగళవారం చర్చావేదిక నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ముందు స్థానికులు వార్డులోని సమస్యలను ఏకరవు పెట్టారు. ముఖ్యంగా రోడ్లు, కాలువలు లేవని, వర్షపునీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. అలాగే ట్రాఫిక్, ఆకతాయిల బెడద, వాహనాల రైడింగ్‌తో భారీ శబ్దాలు చేస్తున్నట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. ఇందులో ప్రధానంగా నీరు గట్టువారిపల్లె నుంచి వస్తున్న వరద నీటిని దారి మళ్లించడానికి కదిరి రోడ్డు వెంబడి పెద్ద డ్రైనేజీ నిర్మించి, కుర వంకలో కలిసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే మూడు ఏరియాలలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ దృష్టికి తీసుకెళ్లి అంచెలంచెలుగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, జనసేన రాష్ట్ర నాయకురాలు దారం అనితలు ప్రజల ప్రస్తావించిన సమస్యలపై స్పందించారు. వీటిని స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్.. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను తన వ్యాఖ్యలతో అటు కమిషనర్, ఇటు నేతల దృష్టికి తెచ్చారు. ప్రజలు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 2:20 గంటలకు ప్రారంభమైన చర్చావేదిక సాయంత్ర 3:40 గంటల వరకు జరిగింది. మరోవైపు పట్టణంలోని వివిధ కాలనీల అసోసియేషన్ (అపెక్స్), స్థానిక ప్రశాంత్‌నగర్ అసోసియేషన్ సంఘాలు వార్డులో నెలకొన్న వివిధ సమస్యలను సమావేశంలో ప్రస్తావించడమే కాకుండా కమిషనర్‌కు వినతిపత్రం రూపంలో అందజేశారు. ఈ సమావేశంలో ప్రశాంత్‌నగర్‌లోని నేతలు మార్పూరి మల్లికార్జుననాయుడు, ఎస్.రవీంద్రనాయుడు, కె.వెంకటరెడ్డి, కె.అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్.మస్తాన్‌వలి, పద్మావతమ్మ, భాస్కర్, అడ్వకేట్ బయారెడ్డి, చరణ్‌రాయల్, సేగు రెడ్డెప్పరెడ్డి, సిద్ధార్థ, కృష్ణారెడ్డి సిద్ధార్థ కళాశాల ప్రతినిధులు, రిటైర్డ్ హెచ్‌ఎం సోమశేఖర్, గోపాలకృష్ణ, స్థానిక సచివాలయ అడ్మిన్ సెక్రటరీ అభిషేక్, ఆంధ్రజ్యోతి మదనపల్లె పీసీ ఇన్‌చార్జి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.





పశాంత్‌నగర్ సమస్యలను వినతిపత్రం రూపంలో కమిషనర్ ప్రమీలకు అందజేస్తున్న అపెక్స్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, హాజరైన ప్రజలు

ప్రధాన కూడళ్లలో డస్ట్‌బిన్‌లు లేవు



ప్రశాంత్‌నగర్, ఏవీనాయుడు కాలనీల్లో తగినన్ని కుప్పతొట్టెలు లేవు. దీంతో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. మైనర్ పిల్లలు ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తొలగించి బైక్‌లపై అతిగా వీధుల్లో నడుపుతూ శబ్దంతో హోరెత్తిస్తున్నారు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

-సుజాత, ప్రశాంత్‌నగర్

రోడ్లో నడవాలంటే కష్టంగా ఉంది



ప్రశాంత్‌నగర్‌లోని ఇంటర్నల్ రోడ్లు గుంతలమయం అయ్యాయి. అక్కడ నడవాలంటే కష్టంగా ఉంది. ద్విచక్ర వాహనాలు వేగంగా వస్తుండటంతో చిన్నపిల్లలు ప్రమాదానికి గురవుతున్నారు. అక్కడక్కడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

-జయలక్ష్మి, ప్రశాంత్‌నగర్, మదనపల్లె

వీధికుక్కల బెడద ఎక్కువ



స్థానికంగా వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురికినీరు వీధుల్లో ప్రవహిస్తోంది. ముఖ్యంగా వర్షం పడితే చాలు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. నడవడానికి వీలులేకుండా ఇళ్లలోకి వస్తున్నాయి.

- అర్జున్, జనసేన నాయకుడు, మదనపల్లె

దొంతివీధిలో బ్రిడ్జి సమస్య



దొంతివీధిలో కాలువపై నిర్మించిన బ్రిడ్జి దుస్థితిలో ఉంది. దీనికి మరమ్మతులు చేపట్టాలి. అక్కడ కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రివేళలో ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు.

- ఎస్.లతీఫ్, ఎన్.ఎల్.ఎఫ్.అధ్యక్షుడు,మదనపల్లె

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా, పూర్తి స్థాయిలో లేదు. ఉన్నవి కూడా దుస్థితిలో ఉన్నాయి. వర్షం వస్తే కాలువలు సరిపోక వర్షపు నీరు వీధుల్లోకి వస్తోంది. పిల్లలు, వృద్ధులు నడవలేక అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మెగా డ్రైనేజీని నిర్మించాలి.

- రామ్మోహన్‌నాయుడు, మాజీ సైనికుడు, మదనపల్లె.

కుక్కల బెడద ఎక్కువగా ఉంది



ప్రశాంత్‌నగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇవి గుంపుగా చేరి పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తుండగా, వాహనదారులను వెంబడిస్తున్నాయి. శానిటరీ న్యాప్‌కిన్‌లు డ్రైనేజీల్లో పడేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది చెత్తను తీసుకెళ్లేటప్పుడు రోడ్ల మీద పడుతున్నాయి.

- సుభాషిణి, ఫోర్డ్ సంస్థ ప్రతినిధి

డివైడర్లు లేక ప్రమాదాలు



ప్రశాంత్‌నగర్‌లో తగిన స్థాయిలో నీరు సరఫరా లేదు. డివైడర్లు లేక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి. ఈ ప్రజా వేదికకు రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా వచ్చి ఉంటే బాగుండేది. ట్రాఫిక్, ఆక్రమణలు, ప్రమాదాల నివారణ చేయాల్సింది వాళ్లే కాబట్టి వారు స్పందించాలి.

- గోపాలకృష్ణ, ప్రశాంత్‌నగర్

సమావేశానికి స్థలం చూపండి



ప్రశాంత్‌నగర్, ఏవీ నాయుడు కాలనీ, సప్తగిరినగర్‌లకు చెందిన మహిళలు మీటింగులు పెట్టుకునేందుకు స్థలం లేదు. ఎ.వి.నాయుడు కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద ఆరుబయట ఇంతకాలం మీటింగులు పెట్టుకునే వాళ్లం. దోమలు అధికంగా ఉన్నాయి. ఇప్పుడు అక్కడ కూడా మీటింగులు పెట్టుకోవడానికి వీలు లేకుండా పోతోంది. అధికారులు స్పందించి మహిళల కోసం మీటింగ్ స్థలం చూపించాలి.

- వెన్నెల, సప్తగిరినగర్

సారా విక్రేతల అరెస్టు

నిమ్మనపల్లి జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 15లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతికి చెందిన యల్లారెడ్డి(49) అదే పంచాయతి నాగులయ్యగారిపల్లికి చెందిన నాగరాజ(38)లు గ్రామ సమీపంలో సారా తయారు చేసి విక్రయిస్తున్న ట్లు సమాచారం రావడంతో దాడులు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వలసపల్లె నవోదయ కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమార్తె కె.తేజా(22) మంగళవారం అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పీలేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం గూడరేవుపల్లె వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. వారి నుంచి రూ.20,300లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ప్రిన్సిపాల్, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలంలోని కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్లను బదిలీ చేసి, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఘోరమైన సమస్యలను ఆడిట్ బృందం వెలికితీయడంతో అసలు గుట్టు రట్టు అయ్యిందన్నారు. ప్రశ్నించిన విద్యార్థులను దూషించి, హింసించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. తప్పుడు లెక్కలు చూపి వస్తువులను స్వాహా చేసిన వారి నుంచి సొమ్ములు రికవరీ చేయలన్నారు. వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్య గొడవ

- తలకు రక్తగాయాలతో ఆస్పత్రిలో చేరిన విద్యార్థి మణికంఠ

మదనపల్లె అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన రెండు ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రశాంత్‌నగర్ విద్యార్థులు రోడ్డుపై గొడవ పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటనలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న మణికంఠ అనే విద్యార్థిని మరో ప్రైవేటు జూనియర్ కళాశాల చెందిన విద్యార్థులు మా జోలికి వస్తావా అంటూ కర్రలతో తలపై బలంగా కొట్టారు. కొందరు పిడుగుద్దులు గుద్దారు. దీంతో రక్తగాయల పాలైన మణికంఠను తోటి విద్యార్థులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరోసారి మాతో పెట్టుకుంటే నీ అంతు చూస్తామని కొందరు విద్యార్థులు హెచ్చిరించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ



సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్ఐ బాలకృష్ణ

పీలేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరులోని సం జయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు సైబర్ మోసాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో పెట్టుబడు లను రెట్టింపు చేస్తామని చాలా మంది మోసగాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటువంటి ప్రకటనలు చూసి మోసపోకూడదన్నారు. ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ అటువంటి ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 1930 నెంబరకు తెలియజేయాల న్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు లెఫ్టినెంట్ డా.వెంకటరమణ య్య, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గాలివీడు మండలానికి చెందిన ఓ విద్యార్థిని మదనపల్లెలోని ఓ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోందన్నారు. కాగా ఈ నెల 26న కళాశాలకు వెళ్లి కనపడకుండా పోయిందన్నారు. కుటుంబసభ్యులు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకపోవడంతో మంగళవారం మదనపల్లె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ శ్రేణులను ఉత్సాహపరచిన యువగళం



సమావేశంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర టీడీపీ శ్రేణులలో ఉత్సాహం నింపి కూటమి అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. యువగళం పేరుతో మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బి.కొత్తకోట పట్టణంలో ఆమె కేక్ కట్ చేసి నాయకులతో కలసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా 97 నియోజకవర్గాలలో 3132 కిలోమీటర్లు నడిచి వైసీపీ నేతలకు వణుకు పుట్టించారని, అదేవిధంగా మంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చావిడి కిట్టన్న, ఎండీ మస్తాన్, ప్రభాకర్, రవికుమార్, పద్మనాభం, వెంకట్రమణ, మదార్‌వల్లి, రవికుమార్, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం

తంబళ్లపల్లె, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా కృషిచేయాలని ఏపీఎం గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ..మండలంలో ఉన్న నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులను చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం నుంచి 45 రోజుల పాటు శిక్షణా కేంద్రాల్లో అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, ఏవో థామస్ రాజ, ఈవోపీఆర్డి దిలిప్‌కుమార్, ఎంఈవో త్యాగరాజు, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

పీలేరులో: అక్షరాస్యత శాతం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని పీలేరు ఎంపీడీవో శివశంకర్ పేర్కొన్నారు. 'ఉల్లాస్' కార్యక్రమ వలంటీర్లుగా ఎంపికైన సంఘమిత్రలకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలంలో 600 మంది పూర్తి నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరినీ అక్షరాస్యులుగా చేయడానికి మండల వ్యాప్తంగా 60 మంది సంఘమిత్రలను వలంటీర్లుగా ఎంపిక చేశామని వారంతా ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎంఈవో లోకేశ్వరరెడ్డి, సీసీ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు సీఐ కౌన్సెలింగ్

బి.కొత్తకోట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్ బాబు మంగళవారం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బి.కొత్తకోట, మదనపల్లె మార్గంలో వాహనాలను తనిఖీ చేసి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కొనసాగుతున్న పింఛన్ల పరిశీలన

కలికిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛను పొందుతున్న వారి శారీరక పరిస్థితుల గురించి వైద్య నిపుణులు మంగళవారం నుంచి పరిశీలించే కార్యక్రమం కొనసాగుతోంది. మొదటి రోజు అద్దవారిపల్లె, గుండ్లూరు, మహల్ పంచాయతీల్లో 21 మందిని పరిశీలించారు. మండలంలో 77 పింఛనుదారులను పరీక్షించాల్సి ఉంది. ఎంపీడీవో భానుమూర్తి రావు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

ముగిసిన చండీ యాగం

కలికిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత యల్లమ్మ ఆలయంలో జరుగుతున్న చండీయాగం మంగళవారంతో ముగిసింది. శివకోటి మహాలక్ష్మి శ్రీపీఠం వ్యవస్థాపకుడు అప్పాస్వామి ఈ చండీ యాగాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం యల్లమ్మతల్లికి అభిషేకాలు చేసి చండీయాగాన్ని పూర్తి చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిపించారు. ఆలయ నిర్వాహకులు అశోక్‌కుమార్ రెడ్డి, మధుసూదన రెడ్డి, సురేంద్ర రెడ్డి, శివాలయం అర్చకులు శివస్వామి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

శ్రమ దోపిడీ చేస్తున్న వారిని సస్పెండ్ చేయాలి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్



మున్సిపల్ చైర్‌పర్సన్‌కి సమస్యలు విన్నవిస్తున్న వైస్‌చైర్మన్ వెంకటాచలపతి

మదనపల్లె టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ను శ్రమ దోపిడీకి గురిచేస్తున్న ఇద్దరిని వెంటనే సస్పెండ్ చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్లో చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కాగా అజెండాలోని అంశాలను ప్రస్తావిస్తూ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య కార్మికులకు ఉదయం 5గంటలకు మస్టర్లు వేసేటప్పుడు పర్యవేక్షణ కొరవడిందన్నారు. కొందరు యూనియన్ లీడర్లంటూ వచ్చి హాజరుకాని కార్మికుల పేర్లు రిజిస్టర్ ఎక్కిస్తూ వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. హాజరైన వారికి గైర్హాజరు వేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, తన వద్ద సాక్ష్యాలు ఉన్నాయని వారిని సస్పెండ్ చేయాలని చైర్‌పర్సన్‌ను కోరారు. కార్మికులకు సరఫరా చేసే కొబ్బరినూనె, సోపులు ఏ బ్రాండ్‌వి పంపిణీ చేస్తారో అజెండాలో తెలపలేదని, ఇవి సరఫరా చేసే కాంట్రాక్టర్ పేరు, వివరాలు అజెండాలో పొందుపరచకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కౌన్సిలర్ బీఏ ఖాజా మాట్లాడుతూ దక్నీపేటలోని మటన్ మార్కెట్ నుంచి ఆరేళ్లుగా అద్దెలు వసూలు చేయలేదని దీని వలన మున్సిపాలిటికి రూ.50లక్షల ఆదాయం కోల్పోయిందని వాపోయారు. గాంధీరోడ్డులో ఆర్అండ్‌బీ స్థలాన్ని పరిరక్షించాలని కౌన్సిలర్ ఫర్జానా కోరగా, పట్టణంలో వీధి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని వైస్‌చైర్మన్ నూర్‌ఆజమ్‌సూచించారు. వీటిపై మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ 272 మంది పారిశుధ్య కార్మిలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా మస్టర్ వేసేందుకు చర్యలు తీసుకుంటామని, కార్మికులకు పంపిణీ చేసే కొబ్బరినూనె, సోపులను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచి, నాణ్యమైన వస్తువులను కౌన్సిల్‌కు చూపించి కార్మికులకు పంపిణీ చేస్తామన్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని కౌన్సిలర్ల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కాగా చైర్‌పర్సన్ మనూజ మాట్లాడుతూ పట్టణంలో 89 చోట్ల రూ.13.5 కోట్ల జనరల్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పారిశుధ్య పనులు, వీధిదీపాల మరమ్మతులు చేయించడంతో పాటు 2 నుంచి 3 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు తులసి, రాధమ్మ, రజని, లత, నాగార్జునబాబు, ప్రసాదబాబు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అన్ని వసతులు కల్పించాలి



పాఠశాలలో వంటగది రికార్డులను తనిఖీ చేస్తున్న డీఆర్‌పీ పృధ్వీరాజ్

నిమ్మనపల్లి జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు గ్రామ పంచాయతిలో ఉన్న కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు అన్ని వసతులు కల్పించాలని జిల్లా రీసోర్స్ పర్సన్ పృధ్వీరాజ్ సూచించారు. మంగళవారం ఆయన కేజీబీవీ పాఠశాలలోని 261మంది విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులపై ఆయన ఆరాతీ శారు. ఈ నెల 26 నుంచి 28వతేదీ వరకు జరిగిన తనిఖీల్లో భాగంగా రికార్డులు, రిజి స్టర్‌లు, స్టోర్‌రూమ్, వంట గది, బాత్‌రూమ్‌లు, లాబ్, తరగతి గదులు, లైబ్రరీ, కూరగాయలు, బియ్యం, డిజిటల్ బోర్డులు, విద్యాసామగ్రిలతో పాటు ప్రతి దాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ మీకు హాస్టల్‌లో సమస్యలు ఏమైనా ఉన్నాయా, ఉప్యాధ్యాయులు పనితీరు ఎలా వుందని అడిగి తెలుసుకొన్నారు. సీసీ కెమెరాలు పని చేసే విధంగా చేస్తామని, ఇంటర్‌లో మరిన్ని గ్రూపులు ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో మునివెంకటమ్మ ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసలు

మదనపల్లె అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో పరిధిలో ఉత్తమ ఉద్యోగులకు డీఎం వెంకటరమణారెడ్డి మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానిక డిపో ఆవరణలో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో వన్ డిపో రీజయన్‌లోనే మొదటి స్థానం సాధించిందన్నారు. అన్ని పెరామీటర్లలో డిపో ముందు ఉండడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇందుకు ఉద్యోగుల సహకారం ఎంతగానో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, తదితరులు పాల్గొన్నారు.